RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి | సంపుటి : 2 సంచిక : 112 | శనివారం, జూన్ 1, 2024 | పేజీలు : 4

### ఎగ్జిట్ పోల్ టివి డిబేట్లలో కాంగ్రెస్ పాల్గొనదు: పవన్ ఖేరా

న్యూఢిల్లీ: టెలివిజన్ ఛానళ్లలో ఎగ్జిట్ పోల్ డిబేట్లలో కాంగ్రెస్ పాల్గొనబోదని కాంగ్రెస్ ప్రతినిధి పవన్ ఖేరా తెలిపారు. ఎగ్జిట్ పోల్ ప్రిడిక్షన్స్ ఎన్నికలు ముగిశాక అరగంట తర్వాత శనివారం ప్రచురితం కాగలవు. వాస్తవిక ఫలితాలు జూన్ 4న రానున్న నేపథ్యంలో ఊహాగానాలు, టిఆర్పి స్లగ్ఫెస్ట్ లో పాలుపంచుకోబోమని ఖేరా తెలిపారు. అయితే తాము జూన్ 4 తర్వాత డిబేట్లలో పాల్గొంటామని పవన్ ఖేరా ఎక్స్ వేదికలో పోస్ట్ పెట్టారు.



## సజ్జలపై క్రిమినల్ కేసు నమోదు

అమరావతి: వైసిపి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిపై క్రిమినల్ కేసు నమోదైంది. కౌంటింగ్ ఏజెంట్ల సమావేశంలో ఆయన చేసిన వ్యాఖ్యలపై ఎన్నికల కమిషన్ సీరియస్ అయి కేసు నమోదు చేయాలని ఆదేశించింది. కౌంటింగ్ ఏజెంట్లను రెచ్చగొట్టే విధంగా మాట్లాడారంటూ టిడిపి నేతలు దేవినేని ఉమ, గూడపాటి లక్ష్మీనారాయణ తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సజ్జల రామకృష్ణారెడ్డి పై 153, 505, 125 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. రూల్ ప్రకారం కాకుండా ప్రత్యర్థి పార్టీ ఏజెంట్లకు అడ్డంపడే విధంగా వ్యవహరించాలని సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన కామెంట్స్ పై ఈ కేసు నమోదైంది. రూల్ ప్రకారం పోవడానికి ప్రయత్నించవద్దని కూడా ఆయన అన్నారని టిడిపి నేతలు ఫిర్యాదు చేశారు.

# జయజయహేకు జై

హైదరాబాద్ :'జయ జయహే తెలంగాణ' గేయాన్ని ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర గీతంగా ఆమోదించిన ట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ప్రకటించారు. రాష్ట్రం ఆవిర్భవించి ఈ ఏడాది జూన్ 2వ తేదీ నాటికి పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా దశాబ్ది ముగింపు వేడుకలను ఘనంగా ని ర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అదే వేడుకల సందర్భంగా జయ జయహే తెలంగాణ గీతాన్ని జాతికి అం కితం చేస్తామని ఆయన చెప్పారు. ఉద్యమ కాలంలో అందరినీ ఉర్రూతలూగించిన తెలంగాణ ఖ్యాతిని చాటిన ఈ గీతా న్ని భవిష్యత్‌లో తరతరాలు పాడుకునేలా, అందరి ఆమోదం తో రాష్ట్ర గీతంగా ఆమోదించినట్లు సిఎం తెలిపారు. తెలంగాణ కవి, రచయిత అందెశ్రీ ఇరవై ఏళ్ల క్రి తం రాసిన ఈ గీతాన్ని యధాతథంగా ఆమోదించినట్లు ఆయన ప్రకటించారు. ఆస్కార్ అవార్డు గ్రహీత కీరవాణి సం గీతంతో పాటు స్వరాలు కూర్చారు.




## కెసిఆర్‌కు ప్రభుత్వం నుంచి అందిన ఆహ్వానం

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ఆహ్వానించింది. ఈ మేరకు, సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో నందినగర్‌లోని కేసీఆర్ ఇంటికి ప్రభుత్వ ప్రతినిధులు వేణుగోపాల్, అర్వీందర్ సింగ్ వెళ్లారు. ఆవిర్భావ వేడుకలకు ఆయనను ఆహ్వానించిన అనంతరం కేసీఆర్ నివాసం బయట వారు మీడియాతో మాట్లాడుతూ ఆహ్వాన పత్రికతో పాటు కేసీఆర్‌కు సీఎం రేవంత్ రెడ్డి రాసిన లేఖను కూడా అందించినట్లు చెప్పారు. ఉద్యమంలో కేసీఆర్ పాత్ర ఉందని అందుకే ఆహ్వానించినట్లు చెప్పారు. ఆహ్వానం పట్ల కేసీఆర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో ఉద్యమనేతగా ఆయనను ఆహ్వానించామన్నారు. ఈ వేడుకలలో కేసీఆర్ భాగస్వాములు అవుతారని భావిస్తున్నట్లు చెప్పారు. కాగా, విపక్షనేతగా, ఉద్యమ భాగస్వామిగా కేసీఆర్‌ను ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.



## బిభవ్ కుమార్‌కు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ



న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ సభ్యురాలు స్వాతిమాలివాల్ పై దాడి కేసులో కోర్టు.. ఢిల్లీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్ పీఏ బిభవ్‌కుమార్‌కు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. మూడు రోజుల పోలీస్ కస్టడీ ఇవాళ్టితో ముగియడంతో పోలీసులు బిభవ్‌ను మళ్లీ ఢిల్లీలోని తీస్ హజారీ కోర్టులో హాజరుపర్చారు. బిభవ్‌కుమార్ నుంచి కేసుకు సంబంధించి మరిన్ని వివరాలు రాబట్టాల్సి ఉందని, కాబట్టి అతనికి మరో రెండు వారాల జ్యుడీషియల్ కస్టడీ విధించాలని పోలీసులు కోరారు. దాంతో కోర్టు అతనికి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. కాగా, ఇటీవల ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను కలిసేందుకు ఆయన నివాసానికి వెళ్లిన సమయంలో ఆయన పీఏ బిభవ్‌కుమార్ తనపై దాడికి పాల్పడ్డాడని ఆప్ ఎంపీ స్వాతిమాలివాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు బిభవ్‌ను ఈ నెల 18న అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టులో హాజరుపర్చగా ముందుగా ఐదు రోజుల పోలీస్ కస్టడీ, తర్వాత నాలుగు రోజుల జ్యుడీషియల్ కస్టడీ, అనంతరం మళ్లీ మూడు రోజుల పోలీస్ కస్టడీ విధించింది. ఆ మూడు రోజుల పోలీస్ కస్టడీ కూడా ఇవాళ్టితో ముగియడంతో మళ్లీ కోర్టులో హాజరుపర్చగా.. 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ వేసింది.

## 2న లొంగిపోతున్నా...

న్యూఢిల్లీ: ఆదివారం (2న) తాను లొంగిపోతున్నానని ఢిల్లీ ముఖ్యమంత్రి అర్వింద్ కేజ్రీవాల్ శుక్రవారం వెల్లడించారు. జైలులో తనను మరింతగా వేధించినా తాను తగ్గేది లేదని ఆయన స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం నిమిత్తం ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్‌కు సుప్రీం కోర్టు జూన్ 1 వరకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన విషయం విదితమే. జైలులో నుంచి బెయిల్‌పై విడుదల అయిన అనంతరం ఆయన ఉత్తర ప్రదేశ్, పంజాబ్, ఢిల్లీ, మహారాష్ట్రలలో ప్రచారం చేశారు.



కేజ్రీవాల్ వీడియో ద్వారా విలేకరుల గోష్ఠిలో మాట్లాడుతూ, 'నేను జూన్ 2న లొంగిపోవలసి ఉంది. ఈ దఫా ఎంత కాలం జైలులో ఉంటానో నాకు తెలియదు. నియంతృత్వం నుంచి ఈ దేశాన్ని కాపాడేందుకు జైలుకు వెళుతున్నాను. అందుకు గర్విస్తున్నాను' అని చెప్పారు. 'వారు నా ఆరోగ్యాన్ని దెబ్బ తీయాలని చూశారు. నేను జైలులో ఉండగా నా మందులు ఆపేశారు. అరెస్టు అయిన తరువాత ఆరు కిలోలు బరువు తగ్గాను. అరెస్టు అయినప్పుడు నా బరువు 70 కిలోలు. జైలులో నుంచి బయటకు వచ్చిన తరువాత నేను బరువు పెరగలేదు' అని కేజ్రీవాల్ తెలిపారు. వైద్యులు పలు పరీక్షలు సూచించారని, 'అంతర్గతంగా ఉన్న ఏదో ఆరోగ్య స్థితికి ఇది సూచిక కావచ్చునని వారు భావించారు' అని ఆయన చెప్పారు. తీహార్ జైలులో లొంగిపోవడానికి ఆదివారం తెల్లవారు జామున 3 గంటలకు తన నివాసం నుంచి బయలుదేరతానని కేజ్రీవాల్ తెలియజేశారు. 'వారు నన్ను మరింతగా వేధించే యత్నం చేయవచ్చు. కాని నేను తగ్గబోను. జైలుకు తిరిగి వెళ్లిన తరువాత మీ (జనం) గురించే నా ఆందోళన అంతా మీకు సేవలు ఆగవని భరోసా ఇస్తున్నాను.

## ప్రజ్వల్ రేవణ్ణ అరెస్టు

బెంగళూరు: పలువురు మహిళలపై లైంగిక దాడి చేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న జెడిఎస్ ఎంపి ప్రజ్వల్ రేవణ్ణను బెంగళూరు పోలీసులు గురువారం అర్ధరాత్రి అరెస్టు చేశారు. జర్మనీ నుంచి బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకోగానే ప్రజ్వల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భారీ భద్రత మధ్య అతడిని విచారణ నిమిత్తం సిఐడి కార్యాలయానికి తరలించారు. లోక్ సభ ఎన్నికలలో హాసన్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి ఎంపిగా ఆయన పోటీ చేశారు. ప్రజ్వల్ పలువురు మహిళలపై లైంగిక దాడి చేసినట్లు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆయన దేశం వదిలిపారిపోయిన విషయం తెలిసిందే. ప్రజ్వల్ రేవణ్ణపై లుకవుట్, బ్లూ కార్నర్ నోటీసులు జారీచేసినట్లు కర్నాటక ప్రభుత్వం వెల్లడించింది. భారత్‌కు తిరిగి తీసుకురావడానికి ఇంటర్‌పోల్ సాయం తీసుకుంటామని పేర్కొంది. లుకవుట్ నోటీసు గురించి పోర్టులు, విమానాశ్రయాలకు రాష్ట్ర ప్రభుత్వం తెలియజేసింది. మరో బాధితురాలు కూడా ముందుకు వచ్చి ప్రజ్వల్‌కు వ్యతిరేకంగా ఫిర్యాదు చేసినట్లు హెూం మంత్రి వెల్లడించారు. బాధితురాలి వాంగ్మూలాన్ని పోలీసులు నమోదు చేశారని, ఈలోగా మరో బాధితురాలు కూడా ప్రజ్వల్‌కు




వ్యతిరేకంగా ఫిర్యాదు చేశారని ఆయన తెలిపారు. ఆమె గురించి వివరాలు వెల్లడించలేనని హెూంమంత్రి చెప్పిన విషయం తెలిసిందే.

## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవానికి సర్వసన్నద్ధత




హైదరాబాద్: తెలంగాణ పదో ఆవిర్భావ దినోత్సవం వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. జూన్ 2న జరిగే ఈ ఆవిర్భావ దినోత్సవంలో అనేక సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. గన్ పార్క్ లోని తెలంగాణ అమరవీరుల స్మారకం వద్ద ఉదయం 9.30 కు ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పూలతో శ్రద్ధాంజలి ఘటించనున్నారు. సికింద్రాబాద్ లోని పరేడ్ గ్రౌండ్ లో ఉదయం 10 గంటలకు ఆయన జాతీయ పతాకాన్ని ఎగురవేయనున్నారు. రాష్ట్ర పోలీసు దళాల గౌరవ వందనాన్ని కూడా స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ రాష్ట్ర గీతాన్ని కూడా ఆవిష్కరించనున్నారు. ఆ తర్వాత కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జనాన్ని ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఆ తర్వాత పోలీసు అధికారులకు అవార్డులు అందించనున్నారు. సాయంత్రం ట్యాంక్ బండ్ వద్ద హ్యాండ్లూమ్, ప్రత్యేక ఉత్పత్తుల స్టాల్స్, ఫుడ్ కోర్ట్స్, తెలంగాణ వంటకాలు సందర్శకులను ఆకట్టుకోనున్నాయి.

# వివేకానంద రాక్ మెమోరియల్ వద్ద ప్రధాని మోదీ ధ్యానం



కన్యాకుమారి: ప్రధాని నరేంద్ర మోదీ కన్యాకుమారిలో ధ్యానం చేస్తున్న తొలి విజువల్స్ తత్వవేత్త-సన్యాసి స్వామి వివేకానంద విగ్రహం ముందు బీజేపీ నాయకుడిని ట్రాన్స్‌లో ఉంచాయి. ప్రధాని మోదీ శనివారం సాయంత్రం వరకు వివేకానంద రాక్ మెమోరియల్‌లో ధ్యానం చేయనున్నారు. 1892లో స్వామి వివేకానంద భారతదేశ భవిష్యత్తు గురించి స్పష్టమైన దర్శనం కోసం ధ్యానం చేసిన ప్రదేశమైన ధ్యాన మండపం వద్ద ప్రధాన మంత్రి ధ్యానం చేస్తున్నారు. ఇది హిందూ మహాసముద్రం, బంగాళాఖాతం మరియు అరేబియా సముద్రం కలిసే ప్రదేశం మరియు కన్యాకుమారి ఎంపిక జాతీయ ఐక్యత సందేశాన్ని ఇస్తుందని బిజెపి నాయకులు అన్నారు. స్మారక చిహ్నం వద్ద ధ్యానం చేస్తున్న నాయకుడి చిత్రాలను పార్టీ ఈరోజు విడుదల చేసింది. ఒక ప్రత్యేక వీడియో కూడా షేర్ చేయబడింది. సూర్యునికి ప్రార్థనలు చేసే ఆచారమైన 'సూర్య అర్ఘ్య'ను కూడా ప్రధాని మోదీ నిర్వహించారు. 'సూర్యోదయం, సూర్య అర్ఘ్య, ఆధ్యాత్మికత,' అనే చిన్న వీడియో క్లిప్, BJP తన 'X' హ్యాండిల్‌లో పోస్ట్ చేసింది, ప్రధానమంత్రి ఒక సాంప్రదాయ బీకర్ లాంటి చిన్న పాత్రలో నుండి కొంచెం నీటిని సముద్రంలో నైవేద్యంగా (అర్ఘ్య) పోయడం మరియు ప్రార్థించడం చూపిస్తుంది. అతని ప్రార్థన పూసలు (జప మాల) ఉపయోగించి మూడోసారి గెలుపొందాలనే లక్ష్యంతో ప్రధాని గురువారం సాయంత్రం కన్యాకుమారి చేరుకున్నారు మరియు జూన్ 1న ఢిల్లీకి బయలుదేరవచ్చు. మారథాన్ లోక్‌సభ ఎన్నికలు ఏడు దశలుగా సాగుతాయి, జూన్ 1న ముగుస్తాయి. జూన్ 4న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. 2019 లోక్‌సభ ఎన్నికల ఫలితాలకు ముందు, ప్రధాని మోదీ ఉత్తరాఖండ్‌లో ఇదే విధమైన ఆధ్యాత్మిక యాత్రను ప్రారంభించారు. ఆ సమయంలో, అతను కేదార్‌నాథ్ సమీపంలోని పవిత్ర గుహలో ధ్యానం చేస్తున్న ఫోటో కూడా తీయబడింది.

**సూర్యునికి ప్రధాని మోదీ అర్ఘ్యం**

ప్రధాని నరేంద్ర మోడీ తన ధ్యాన ప్రక్రియలో భాగంగా వివేకానంద రాక్ మెమోరియల్ వద్ద శుక్రవారం సూర్యోదయం సమయంలో 'సూర్యునికి అర్ఘ్యం' ఇచ్చారు. ప్రత్యక్షదైవమైన సూర్యునికి అర్చనల్లో భాగంగా 'సూర్యునికి అర్ఘ్యం' ఇచ్చి, ముకుళిత హస్తాలతో ప్రార్థన చేశారు. 'సూర్యోదయం, సూర్యునికి అర్ఘ్యం, ఆధ్యాత్మికత' పేరిట బిజెపి తన 'ఎక్స్' వేదికలో పోస్ట్ చేసిన సంక్షిప్త వీడియో క్లిప్‌లో ప్రధాని సూర్యునికి అర్ఘ్యం విడవడం, జపమాలతో ప్రార్థన చేయడం కనిపించింది. కాషాయ చొక్కా, శాలువా, ధోవతి ధరించిన ప్రధాని మోడీ ధ్యాన మండపంలో ధ్యానంలో నిమగ్నమైన ఫోటోలను కూడా బిజెపి పోస్ట్ చేసింది.

## సంపాదకీయం

# ప్రాణాలు మింగేస్తున్న పొగాకు

పొగాకు ఉత్పత్తుల ప్యాకెట్ల మీద ఎరుపు రంగుతో పెద్ద అక్షరాల్లో 'పొగ త్రాగడం ఆరోగ్యానికి హానికరం' అనే హెచ్చరిక ముద్రించబడి ఉంటుంది. మన అనుమతితోనే నెమ్మదిగా నెమ్మదిగా మనకు దురలవాటుగా మారి కొద్ది కొద్దిగా ప్రాణాలను లాగేసే పొగాకు ఉత్పత్తుల దుష్ప్రభావం పలు వ్యాధులకు కారణమై చివరకు మరణమే శరణ్యం అవుతుంది. అన్నీ తెలిసిన నవ మానవుడు చావు నోట్లో తల పెట్టడం విచారకరం. పొగాకు దురలవాటుతో ప్రపంచవ్యాప్తంగా సాలీన 8 మిలియన్ల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. ప్రతి ఏటా పరోక్షంగా 'సెకండ్ హాండ్ స్మోకింగ్' వల్ల ఒక మిలియన్ అమాయకులు చనిపోయడం జరుగుతున్నది. డబ్ల్యూహెచ్ఓ వివరాల ప్రకారం 20వ శతాబ్దంలో 100 మిలియన్ల మరణాలు పొగాకు కారణంగా జరిగాయని తేలింది. ప్రపంచ కాన్సర్ మరణాల్లో 25 శాతం పొగాకు వాడకంతోనే జరుగుతున్నాయి. ఈ ప్రాణాంతక దురలవాట్లకు బానిసలైన జనం కరోనా వలలో పడి, అనారోగ్య అగ్నికి ఆజ్యం పోసినట్లు, అతి ప్రమాదకర స్థితికి వెళ్లడం విచారకరమని వైద్యులు సూచిస్తున్నారు. పొగ తాగడంతో నేరుగా ఊపిరితిత్తులు బలహీణపడి, కోవిడ్-19 సోకిన వారిలో ఊపిరి అందక క్షణాల్లో కన్ను మూయడం చూసాం. పొగాకు ఉత్పత్తుల్లో సిగరెట్, బీడి, చుట్ట, జర్దా, పొగాకు నమలడం, హీటెడ్ టొబాకో ప్రాడక్ట్స్, ముక్కు పొడి (నశం), టొబాకో క్రీమ్, పొగరాని పొగాకు, డోఖ, హుక్క, క్రెటెక్, రోలీస్, టొబాకో పైప్ లాంటివి అనేకం వస్తాయి. వీటిలో సిగరెట్, బీడీల దురలవాటు ఉన్న వారికి ప్రమాదం అధికంగా కనిపిస్తుంది. కరోనా కల్లోల సమయంలోనైన పొగాకు వాడకాన్ని త్యజించి, పోషకాహారం తింటూ, వ్యాధినిరోధకశక్తిని పెంచుకోవాలని సూచించడం అనుభవించాం. పొగాకు అలవాటును త్యజించడం కొంత కష్టమే అయినా పట్టుదలతో క్రమ క్రమంగా పొగాకుకు దూరం కావాలనే అవగాహన కల్పించుటకు ప్రతి ఏటా 31 మే రోజున 'ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం' పాటించుట జరుగుతున్నది. ఈ వేదికగా సామాన్య ప్రజలకు, విద్యార్థినీవిద్యార్థులకు పొగాకు దురలవాటు పట్ల అవగాహన కల్పించడంతో పాటు 'పొగాకు వ్యతిరేక ప్రతిజ్ఞ' చేయించాలి. 1987లో ఐరాస, డబ్ల్యూహెచ్ఓలు సంయుక్తంగా 31 మే 1988 నుంచి ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం నిర్వహించాలని తీర్మానించారు. ఈ ఏడాది ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం-2024 నినాదంగా 'బాలల్ని పొగాకు పరిశ్రమల నుంచి రక్షిద్దాం' అనే అంశాన్ని తీసుకున్నారు. పొగాకు వాడకాన్ని మానేసిన ఉత్తముల్లో హార్ట్ రేట్ తగ్గుతూ, రక్తంలో కార్బన్ మోనాక్సైడ్ స్థాయి పడిపోతూ, రక్త ప్రసరణ పెరిగి ఊపిరితిత్తులు చురుకుగా పని చేస్తాయి. దీనితో దగ్గు, శ్వాస ఇబ్బందులు తొలగి పోతాయి. పొగాకు వినియోగానికి సెలవు పలికితే గుండె జబ్బులు, స్ట్రోక్‌లు, లంగ్ కాన్సర్ అవకాశాలు తగ్గుతాయి. పొగాకు అలవాటుతో దంత సమస్యలు, చర్మం ముడతలు, దుర్వాసనలు, సోరియాసిస్, చర్మం/పెదవులపై మచ్చలు, కంటి జబ్బులు, వినికిడి లోపం, మానసిక క్షీణత, అల్జీమర్స్ వ్యాధి, మహిళల్లో రుతుస్రావ సమస్యలు, శరీర కణజాలానికి ఆక్సిజన్ కొరత, జీర్ణనాళ సమస్యలు, ఎముకల బలహీనత, వ్యాధి నిరోధకశక్తి తగ్గడం లాంటి రోగ లక్షణాలు కనిపిస్తాయి. పురుషుల్లో పొగాకు అలవాటుతో సంతానం కలగడం కష్టం కావచ్చు. స్త్రీలలో పొగాకు అలవాటుతో సంతానలేమి జరుగుతుంది. పొగాకు దురవాటుకు లోనైన వారిలో 50 శాతం మందిలో జీవితకాలం తగ్గుతుంది. పొగాకును నోట్లో పెట్టుకుని నమిలే దురలవాటు ఉన్న వారిలో నోటి కాన్సర్, దంతాలు బలహీనపడడం, దంతాలు రంగు మారడం, చిగురు జబ్బులు, పెదవుల మచ్చలు మరియు తెల్ల మచ్చలు కనిపిస్తాయి. పొగాకు వాడకం పెరిగిన కొద్దీ దేశ పేదరికం కూడా పెరుగుతుంది. సిగరెట్ తాగిన తరువాత వదిలే పీకలతో ఆర్సెనిక్, లెడ్, నికోటిన్, ఫార్మాల్డిహైడ్ లాంటి ప్రమాదకర రసాయనాలు, పొగతో కార్బన్ మోనాక్సైడ్, నైట్రస్ ఆక్సైడ్, మీథేన్‌లు విడుదలై పర్యావరణానికి హాని కలుగుతుంది. పొగాకులో నికోటిన్ ఆక్కలాయిడ్ లాంటి 70కి పైగా ప్రమాదకర రసాయనాలు దుష్ప్రభావాలను కలుగిస్తున్నాయి. ఫస్ట్ అండ్ సెకండ్ హాండ్ స్మోకింగ్ వల్ల టిబితో పాటు టైప్-2 డయాబెటిస్ వచ్చే అవకాశం పెరుగుతుంది. ఈ-సిగరెట్ల వాడకంతో కౌమార దశ యువత మరియు పిల్లలు అనారోగ్యాల పాలు అవుతున్నారు. పొగాకు దురలవాటుతో ఆరోగ్యానికే కాకుండా ఆర్థిక స్థితికి కూడా నష్టం కలుగుతూ, సమాజంలో చిన్న చూపుకు లోనవుతారు. ఆరోగ్యానికి అతి హానికరమని ప్రకటనలు చేస్తున్న ప్రభుత్వాలు పొగాకు, ఆల్కహాల్, మాదకద్రవ్యాలను నిషేధిస్తే బాగుంటుందని బాధ్యతగల పౌరులు సూచిస్తున్నారు. అందరికి సులభంగా అందుబాటులో ఉన్నపుడు దురలవాటును మానడం అతి కష్టం. ఒక సగటు వ్యక్తి తన జీవితకాలంలో పొగాకు వాడకంతో వ్యక్తిగత ధనం, వైద్య ఖర్చులు, పనిలో శ్రద్ధ తగ్గడం, కార్యదక్షత తగ్గడం లాంటి కారణాలతో 1.4 మిలియన్ల డాలర్ల ధననష్టం, 10 ఏండ్ల జీవిత కాలం తగ్గుతుందని అంచనా వేయబడింది.

# కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి గౌతమ్





**జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) :** కీసర మండలం భోగారం గ్రామం లోని హోలీ మేరీ కళాశాల లో మల్కాజ్గిరి పార్లమెంటు నియోజకవర్గం అసెంబ్లీ సెగ్మెంట్ లైన మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్పల్లి,ఉప్పల్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ కేంద్రాలను మల్కాజ్గిరి పార్లమెంటు నియోజకవర్గం జిల్లా రిటర్నింగ్ అధికారి గౌతమ్, కుషాయి గూడ. ఏ సి పి మహేష్ గౌడ్ ,అదనపు కలెక్టర్ విజేందర్ రెడ్డి తో కలిసి ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించి అక్కడ పూర్తి అయిన ఏర్పాట్లను పరిశీలించారు. అవసరమైన చోట్ల పలు సూచనలు సలహాలు తెలియజేశారు.ప్రతి కౌంటింగ్ సెంటర్లో సి సి కెమెరా, బారి కేడింగ్, కరెంటు ఇంటర్నెట్, మౌలిక వసతుల ఏర్పాట్లు పూర్తి అయినట్లు తెలిపారు.చిన్న చిన్న పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కీసర ఆర్డి ఓ ఉపేందర్ రెడ్డి, ఎన్నికల విభాగం అధికారి రాజేశ్వర్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రాణాంతకమైన పొగాకును నిర్మూలించాలంటూ ప్రతిజ్ఞ

**శామీర్ పేట, (గరుడ వార్త) :** ప్రాణాంతకమైన పొగాకును నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ శ్రీకాంత్ పిలుపునిచ్చారు పిలుపునిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. శుక్రవారం మండల కేంద్రం శామీర్ పేట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గ్రామాలలో పొగాకు తినడము, తాగడంపై అవగాహన కల్పించాలన్నారు. పొగాకు తీసుకోవడంతో వచ్చే వ్యాధుల పట్ల వారికి క్షుణ్ణంగా వివరించాలని సూచించారు. అనంతరం పొగాకును నిర్మూలించాలని వైద్యులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శ్వేత, సంగీత, రవీందర్ బాబు, సృజన, ఫెలిష్, రాకేష్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# నీతికి నిలువెత్తు నిదర్శనం దుద్దిళ్ల శ్రీధర్ బాబు

### -మంథనిలో ఘనంగా శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు



**మంథని:** నీతికి నిలువెత్తు నిదర్శనం ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మాత్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు అని పలువురు కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. మంత్రి శ్రీధర్ బాబు జన్మదినం సందర్భంగా గురువారం మంథనిలోని కూరగాయల మార్కెట్లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అలాగే యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎరుకల ప్రవీణ్ ఆధ్వర్యంలో మంథని అంబేద్కర్ చౌరస్తాలో కేక్ కట్ చేసి బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పలువురు కాంగ్రెస్ నాయకులు రక్తదానం చేశారు. బస్టాండ్ ఆవరణలో ప్రచార కమిటీ కన్వీనర్ వొడ్నాల శ్రీనివాస్, గుడి అశోక్ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆ తదుపరి ఎస్ సి సెల్ డివిజన్ అధ్యక్షుడు మంథని సత్యం ఆధ్వర్యంలో మాతా శిశు ఆస్పత్రిలో కేక్ కట్ చేసి బాలింతలు, గర్భిణులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో కొనసాగుతూ మచ్చ లేని విలక్షణ వ్యక్తిత్వం గల నాయకుడు మంత్రి శ్రీధర్ బాబు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, ఎంపిపి కొండ శంకర్, మున్సిపల్ చైర్పర్సన్ పెంద్రి రమ-సురేష్ రెడ్డి, టిపిసిసి ఎలక్షన్ కమిషన్ కో ఆర్డినేషన్ కమిటీ మెంబర్ శశిభూషణ్ కాచే, మున్సిపల్ అధ్యక్షుడు పోలు శివ, మున్సిపల్ యూత్ కాంగ్రెస్ పెంటరి రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు నూకల బాణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి జనగామ నర్సింగారావు, బిసి సెల్ డివిజన్ అధ్యక్షుడు గొటికార్ కిషన్, ఐఎన్టీయూసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేరవేన లింగయ్య, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముస్కుల సురేందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కుడుదుల వెంకన్న, డివిజన్ యూత్ ప్రధాన కార్యదర్శి ఆర్ల నాగరాజు, అజీంఖాన్,నాయకులు మంథని శ్రీనివాస్, మండల యూత్ ఉపాధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాస్, రేపాక శ్రీకాంత్, మున్సిపల్ యూత్ వర్కిం గ్ ప్రెసిడెంట్ సాదుల శ్రీకాంత్, ఎరుకల రమేష్ బాబు, మోహన్ సాయి, పర్శవేన మోహన్, ఊదరి శంకర్, సింగిల్ విండో డైరెక్టర్లు రావికంటి సతీష్ కుమార్, కొత్త శ్రీనివాస్, నాయకులు ఊట్ల అనిల్, అరెల్లి కిరణ్ గౌడ్, ఇసంపల్లి రా జేశ్వర్, ఆకుల కిరణ్, కూర కోటేష్, మంథని సురేష్, వొడ్నాల ప్రవళిక, రాం రాజశేఖర్, ఎండి. జాఫర్, బూడిద రా జు, మాజీ సర్పంచులు రమేష్, రాయమల్లు, నాగుల రాజయ్య, దొరగొర్ల శ్రీనివాస్, ఉషన్ బీ, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలి

### - జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



**జయశంకర్ భూపాలపల్లి:** సర్కారు బడుల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు మరమ్మతులు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ భవిష్ మిశ్రా తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులతో కలసి మహాముత్తారం మండలంలో సుడిగాలి పర్యటన నిర్వహించి పాఠశాలల్లో జరుగుతున్నమరమ్మతు పనుల పురోగతిని స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిధిలా వస్థలో ఉన్న ప్రభుత్వ బడులు ఆధునికతను సంతరించుకొని విద్యార్థులకు ఆహ్లాదకరంగా తయారు చేయడంతో పాటు నాణ్యమైన విద్యాబోధన చేసేందుకు అనుకూలంగా మారుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ముందుగా మహాముత్తారం మండలం కోనంపేట గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో 3.94 లక్షల రూపాయలతో చేపట్టిన మరమ్మతులను, కొత్త ముత్తారం గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో 3. 84 లక్షలతో చేపట్టిన పనులు, మహాముత్తారం గ్రామంలోని కెజిబివి పాఠశాలలో 6.30 లక్షలతో చేపట్టిన మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు చేపట్టిన గ్రామ సమాఖ్యలతో మాట్లాడుతూ ఆయా పాఠశాలల్లో చేపట్టిన పనులను జూన్ 5 వ తేదీ వరకు పూర్తిచేయాలని ఆదేశించారు. ముందస్తుగా 25 శాతం నిధులు మంజూరు చేశామని, చేపట్టిన పనులకు నిధులు సరిపోకుంటే ప్రతిపాదనలు పంపాలని, అదనపు నిధులు మంజూరు చేస్తామని అన్నారు. పాఠశాలలు పున: ప్రారంభానికి ముందు పూర్తిస్థాయిలో చేపట్టిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని వివో లను ఆదేశించారు. పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు పనుల్లో వేగం పెంచి నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరితగతిన పనులు పూర్తి అయ్యేలా చొరవ చూపాలన్నారు. పనుల్లో ఆలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. మహాముత్తారం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్మిస్తున్న డాక్టర్ క్వాటర్స్ ను సందర్శించి ఆగస్టు 15 లోపు భవన నిర్మాణం పూర్తి అవ్వాలని సంబంధిత కాంట్రాక్టర్ ను ఆదేశించారు. అనంతరం మహాముత్తారం లో గల రైతు వేదికలో అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పురోగతి మరియు పనులు పూర్తి చేసే గడువును మండలంలోని ఆయా పాఠశాలల హెడ్ మాస్టర్లు, కాంట్రాక్టు పనులు చేపట్టినవివో లతో సమీక్ష నిర్వహించి పెండింగులో ఉన్న పనులను వేగవంతం చేసి యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని అన్నారు. పాఠశాలలు ప్రారంభం అయ్యే నాటికి వారం రోజుల ముందే పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు.

# నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

**శామీర్ పేట, (గరుడ వార్త) :** నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉండబోతుందని శామీర్ పేట ఏఈ రమేష్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శామీర్ పేట సెక్షన్ పరిధిలోని బొమ్మరాజు పెట్ విద్యుత్ సబ్స్టేషన్లో బొమ్మరాసిపేట ఫీడర్ మరమ్మత్తుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు బొమ్మ రాసిపేట, బాబా గూడా గ్రామాలతో పాటు క్రషర్ మిషన్లకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరకలమ్మ పీడర్ పరిధిలో మరమ్మత్తులు చేపడుతున్నందున మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బొమ్మ రాసి పేట వ్యవసాయ క్షేత్రాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని శామీర్ పేట విద్యుత్ ఏఈ రమేష్ కోరారు.

**అలియాబాద్ సెక్షన్ పరిధిలో....**

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని అలియాబాద్ ఏఈ శ్రీనివాస్ గౌడ్ ఓ ప్రకటనలో శుక్రవారం పేర్కొన్నారు. మూడు చింతలపల్లి మండలం సంపన్ బోల్ పరిధిలోని విద్యుత్ సబ్ స్టేషన్ లో జగ్గంగూడ ఫీడర్ మరమ్మత్తుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు జగ్గంగూడ గ్రామం, వ్యవసాయ పొలాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని చెప్పారు. ఈ విషయం విద్యుత్ వినియోదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఏఈ శ్రీనివాస్ గౌడ్ కోరారు.


# మహిళల కోసం ఇండిగో ప్రత్యేక ఫీచర్



**హైదరాబాద్:**ప్రముఖ దేశీయ విమానయాన సంస్థ ఇండిగో మహిళల కోసం సరికొత్త ఫీచర్‌ను తీసుకొచ్చింది. దీని ద్వారా విమానంలో మహిళలు ఎక్కడెక్కడ సీట్లు బుక్ చేసుకున్నారో తెలుసుకోవచ్చు. దీంతో, ఇకపై మహిళలు వెబ్ చెక్-ఇన్ సమయంలో ఇతర మహిళా ప్రయాణికులు బుక్ చేసుకున్న సీట్లు ఏంటో చూడొచ్చు,ప్రస్తుతానికి పైలట్ మోడ్‌లో దీన్ని అందుబాటు లోకి తెచ్చాం, అని ఇండిగో తమ ప్రకటనలో వెల్లడించింది.

# విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు

### - నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం
### - కౌంటింగ్ కేంద్రాల వద్ద, కౌంటింగ్ కేంద్రానికి వెళ్లే దారుల వెంట సి.సి కెమెరాల నిఘా
### - జూన్ 4 వ తేదీ నుండి కఠినమైన కర్ఫ్యూ అమలు
### - జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్



**బద్వేలు:** 4 న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎలాంటి విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ హెచ్చరించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ పత్రికా ప్రకటన విడుదల చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద, కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లే దారుల వెంట సి.సి కెమెరాల నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి వ్యక్తి కదలికలు సి.సి కెమెరాలు రికార్డు చేస్తాయన్న విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రంలోకి సెల్ ఫోన్లు అనుమతించబడవని, అలా కాదని నిబంధనలు ఉల్లంఘించి సెల్ ఫోన్లు తీసుకువెళితే సీజ్ చేయడం జరుగుతుందని, మళ్ళీ ఇవ్వబడవని వివరించారు. జూన్ 4 నుండి కఠినమైన కర్ఫ్యూ అమలు చేయబడుతుందని, అత్యవసరమైన పరిస్థితుల్లో ఉంటే తప్ప ఎవరూ ఇళ్ల నుండి బయటకు రాకూడదన్నారు.

జూన్ నెల 6 వ తేదీ వరకూ జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్, 30 పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. ఎవరైనా బయటి వ్యక్తులకు, గుర్తు తెలియని వ్యక్తులకు, పాత నేరస్థులకు ఆశ్రయమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూన్ నెల 6 వ తేదీ వరకూ నిబంధనలు అమలులో ఉంటాయని, ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ తెలిపారు.

# కేజీ బంగారం సీజ్



**ప్రకాశంజిల్లా** :టంగుటూరు టోల్ ప్లాజా వద్ద కారులో భారీగా తరలిస్తున్న బంగారాన్ని పోలీసులు పట్టుకున్నారు. పక్కా సమాచారం అందడంతో ప్లాన్ చేసి కారులో తరలిస్తున్న కేజీ 280 గ్రాముల బంగారంతో పాటు 58వేల రూపాయిల నగదు, బంగారం తరలిస్తున్న కారు, ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడ్డ బంగారం విలువ సుమారుగా 90 లక్షల వరకు ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. చెన్నై నుండి నల్గొండకు ఈ బంగారాన్ని తరలిస్తున్నట్లు తెలుస్తోంది. సీజ్ చేసిన బంగారాన్ని పోలీసులు ఇన్ కమ్ ట్యాక్స్ అధికారులకు అప్పగించనున్నారు.

# తిరుమలకు రానున్న అమిత్ షా



**తిరుపతి**:కేంద్ర హోం మంత్రి అమిత్ షా తిరుమల రానున్నారు. ఈరోజు సాయంత్రం 6.15 గంటలకు రేణిగుంట కు చేరుకుని.. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో తిరుమలకు చేరుకుంటారు. రాత్రికి వకుళామాత అతిథిగృహంలో బస చేయనున్నారు. శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకుంటారు. మధ్యాహ్నం తిరుమల నుంచి తిరిగి ఢిల్లీ కి వెళ్లనున్నారు. ఈ క్రమంలో తిరుమల కొండపై భద్రతను కట్టు దిట్టం చేశారు.

# సత్రంపాడు లో ప్రమోన్మాది దాడి




**ఏలూరు** లో దారుణం జరిగింది. ఏలూరు సత్రంపాడులో ప్రేమించిన యువతి పై కత్తితో యువకుడు దాడి చేసాడు. సంఘటన స్థలంలో యువతి మృతి చెందింది. అనంతరం అదే చాకుతో తన మెడ కోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడా యువకుడు. యువతి ఏలూరు ఎంఆర్సి కాలనీకి చెందిన రత్న గ్రేస్ (27) గా గుర్తించారు. యువకుడు ముసునూరు గ్రామానికి చెందిన ఏసురత్నంగా గుర్తించారు. పదవ తరగతి నుండి ఏసురత్నం ప్రేమ పేరుతో తమ కూతురిని వేధిస్తున్నాడన్న రత్న గ్రేస్ తల్లి ఆరోపించింది. మరణించిన యువతి రత్న గ్రేస్ కు మూడు రోజుల క్రితం నిశ్చితార్థం జరిగింది. మాట్లాడాలని పిలిచిన యువకుడు ఏసురత్నం దారుణానికి పాల్పడ్డాడు. పెద్దలకు చెప్పకుండా పెళ్లి చేసుకుందామని యువతి పై ఒత్తిడి చేసినట్లు సమాచారం. మృతురాలు ప్రైవేట్ స్కూల్లో టీచర్ గా పని చేస్తుంది.

# హుండి లెక్కింపు లో చేతివాటం




**కాణిపాకం:** చిత్తూరు జిల్లా కాణిపాకం స్వయంభూ శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి ఆలయ హుండీల లెక్కింపులో బ్యాంకు అప్రైజర్ చేతివాటం ప్రదర్శించాడు. భక్తులు స్వామివారికి సమర్పించిన బంగారం, వెండి తదితర కానుకలను ఆలయ ఆస్థాన మండపంలో గురువారం లెక్కించారు. ఈ క్రమంలో స్థానిక బ్యాంకుకు చెందిన అప్రైజర్ ప్రకాశ్.. ఈ లెక్కింపులో 100 గ్రాముల బంగారు బిస్కెట్‌ను తన సంచిలో దాచుకున్నాడు. విషయాన్ని గుర్తించిన ఆలయ ఈవో సీసీ కెమెరాలను పరిశీలించిచోరీని ధ్రువీకరించారు. అనంతరం బంగారు బిస్కెట్‌ను స్వాధీనం చేసుకుని అతడిని కాణిపాకం పోలీసులకు అప్పగించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# ధూమపానం: ఆరోగ్యానికి హానికరం




సొలనేసి కుటుంబానికి చెందిన ఒక చిన్న మొక్క ద్వారా తయారీ వల్ల పొగ విడుదల అవుతున్నందు వలన దీనికి 'పొగాకు' అనే పేరు వచ్చింది. దీని ఆకుల నుండి సిగరెట్లు, చుట్టలు తయారు చేస్తారు. దీనిని కొన్ని రకాల తాంబూలాలలో కూడా ఉపయోగిస్తున్నారు. క్రీస్తు పూర్వం 1400 ఏళ్ల నాడే పొగాకు వాడకం మొదలైంది. ఉత్తర, దక్షిణ అమెరికా ప్రాంతాల్లోని స్థానిక తెగల వారు పొగాకును దేవుని కానుకగా పరిగణించే వారు. వేడుకల్లో పొగ తాగేవారు. పొగాకు చుట్టల నుంచి వెలువడే ధూమ మేఘాల ద్వారా తమ ప్రార్థనలు భగవంతుని చేరుకుంటాయని వారు నమ్మేవారు. యూరోపియన్లు అమెరికాలో అడుగు పెట్టడం ప్రారంభ మయ్యాక క్రీస్తుశకం 16వ శతాబ్దం నాటికి పొగాకు క్రమంగా యూరోపియన్ దేశాలకు, ఆ తర్వాత శరవేగంగా ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించింది. బ్రిటిష్ వారి ద్వారా పొగాకు భారత దేశానికి చేరుకుంది. పొగాకు పరిచయం కావడానికి ముందు భారత దేశంలో ఎక్కువగా గంజాయి తోనే పొగ తాగేవారు. ఆధునిక వైద్య పద్ధతులు అందుబాటు లోకి వచ్చిన తొలినాళ్లలో పొగాకును ఔషధంగా పరిగణించే వారు. సిగరెట్ల కంపెనీలు వైద్యులతో వ్యాపార ప్రకటనలు ప్రచారం చేసుకునేవి. 20వ శతాబ్దిలో సగానికి సగం కాలం ఇలాగే గడిచింది. పొగాకు వల్ల క్యాన్సర్ వంటి అనర్థాలు తలెత్తు తున్నట్లు గుర్తించిన తర్వాత పరిస్థితిలో మార్పు వచ్చింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ సహా పలు అంతర్జాతీయ ఆరోగ్య సంస్థలు పొగాకు వ్యతిరేక ప్రచారం ప్రారంభించాయి. పలు ప్రభుత్వాలు కూడా పొగాకు వాడకంపై ఆంక్షలు అమలులోకి తెచ్చాయి. బొలీవియా మరియు పెరూ పొగాకు జన్మస్థలంగా పరిగణించ బడతాయి. క్రిస్టోఫర్ కొలంబస్ యాత్రల ద్వారా ఐరోపాకు తీసుకు రాబడినట్లు, అలా పొగాకు సాగు క్రమంగా ఉత్తర అమెరికా, చైనా, భారతదేశం, పూర్వ యుఎస్ ఎస్ఆర్ భూభాగంలో, ట్రాన్స్‌కా కాసియా, ఉజ్బెకిస్తాన్, కజకిస్తాన్, మోల్డోవా, ఉక్రెయిన్, క్రిమియా మరియు క్రాస్నోదర్ భూభాగంలో పెంచడం క్రమానుగతంగా జరిగాయి. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం మే 31న ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏట నిర్వహిస్తారు. పొగాకు వినియోగం వల్ల ఎదురయ్యే అనర్థాలను వివరించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ 1988 నుంచి ఈ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా 110 కోట్ల మంది పొగ తాగుతున్నారని, ఏటా పొగాకు కారణంగా 70లక్షల మంది మరణిస్తున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. 1987లో ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వహించిన సమావేశంలో 1988, ఏప్రిల్ 7న ధూమపాన రహిత దినోత్సవంగా పిలుపు నిచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా పొగాకు వినియోగ దారులను ఏప్రిల్ 7వ తేదీన 24 గంటలపాటు పొగాకు ఉత్పత్తులను వాడకుండా ఉండమని కోరింది. దానిని అనుసరించి 1988లో జరిగిన సమావేశంలో ప్రతి సంవత్సరం మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం జరుపుకోవాలని ప్రకటించింది. ప్రపంచంలోనే అత్యధిక శాతం కిరిబాటి దీవిలో మూడులో రెండొంతుల మంది మగవాళ్లు ధూమపానానికి అలవాటు పడ్డారు. మూడొంతుల మంది ఆడవాళ్లు కూడా పొగ తాగుతున్నారు. యూరప్‌లోని మాంటెనెగ్రో దేశంలో 46శాతం మంది ప్రజలకు పొగతాగే అలవాటుంది. గ్రీస్‌లో 50శాతం మంది మగవాళ్లు, 35శాతం మంది ఆడవాళ్లు ధూమపానం చేస్తారు. ప్రపంచంలోనే అత్యధికంగా ఈస్ట్ తైమూర్‌లో 80శాతం మంది మగవాళ్ల పొగ తాగుతారు. కానీ 6శాతం మంది ఆడవాళ్లకు మాత్రమే ఆ అలవాటుంది. రష్యాలో 15ఏళ్లు పైబడిన మగవాళ్లలో 60శాతం మంది పొగ తాగుతున్నారు. 23శాతం మంది మహిళలకు ఆ అలవాటుంది. ఇక తక్కువగా పొగ తాగేవారు ఉండే దేశాలు...ఘనా, ఇథియోపియా, నైజీరియా, ఎరిత్రియా, పనామా... ఈ ఐదు దేశాలూ అతి తక్కువగా పొగ తాగే దేశాల జాబితాలో ముందు వరుసలో ఉన్నాయి. ఆఫ్రికాలో 14శాతం మంది మాత్రమే పొగ తాగుతారని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. ఇటీవలి కాలంలో అవగాహన కార్యక్రమాల ఫలితంగా భారత దేశంలో పొగతాగే వారి సంఖ్య 33.8 శాతం నుంచి 23 శాతానికి తగ్గినట్లు సర్వేలు వెల్లడిస్తున్నాయి.సిగరెట్లు, బీడీలు, సిగార్లు, హుక్కా వంటి ధూమపానం, గుట్కా నమలడం కోసం పొగాకును వివిధ రకాలుగా విక్రయిస్తారు. నికోటిన్ అనేది పొగాకులో ఉండే ప్రధాన విష పదార్థం. ఇది ధూమపానం వ్యసనానికి దారితీస్తుంది. పొగాకును ఏ రూపంలో తీసుకున్నా నష్టాలే అధికం. పొగాకు శరీర అవయవాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. ఊపిరి తిత్తులకు ముప్పు వాటిల్లి ఎంఫసియా, క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ ఫల్మనరీ డిసీజ్ లాంటి ప్రమాదకరమైన వ్యాధులు సోకుతాయి. మెదడులో రక్త ప్రసరణకు అంతరాయం ఏర్పడుతుంది. గొంతు కేన్సర్, గుండెపోటు వచ్చే అవకాశం ఉంది. అంతేకాకుండా పీల్చేవారికీ కూడా ప్రమాదమే. ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక మరణాలకు కారణమవుతున్న కేన్సర్‌లు, గుండె జబ్బులు, నాన్-కమ్యూనికెబుల్ వ్యాధులు (ఎన్‌సిడిలు) వంటి దీర్ఘకాల శ్వాసకోశ వ్యాధులు ధూమపానం వలనే సంభవిస్తాయి. పొగాకు తాగేవారు శ్వాస సంబంధిత సమస్యలను కలిగి ఉంటారు ఎందుకంటే, పొగాకు ఊపిరి తిత్తులను పూర్తిగా ప్రమాదానికి గురి చేస్తుంది. అంతేకాకుండా, వీరిలో అధిక శ్లేష్మంతో కూడిన దగ్గు కూడా వస్తుంది. 80% కంటే ఎక్కువ ఊపిరితిత్తుల క్యాన్సర్ మరణాలకు ధూమపానం కారణమని తెలింది. సిగరెట్లలో 70కి పైగా హానికరమైన క్యాన్సర్ కలిగించే రసాయనాలు ఉంటాయి. ప్రస్తుత కో విడ్ మహమ్మారి విజృంభిస్తున్న నేపథ్యంలో పొగ త్రాగడం చాలా వరకు తగ్గింది. పొగ తాగడం నేరుగా ఊపిరి తిత్తుల పై ప్రభావం చూపే విషయం వల్ల భయం ప్రధాన కారణం అయితే, లాక్ డౌన్ కట్టుదిట్టమైన చర్యల వల్ల షాపులు ఎక్కువ సమయం మూసి ఉండడం, ఇళ్లనుండి బయటికి వెళ్ళలేక పోవడం ధూమపానానికి ప్రతిబంధకాలుగా మారడం పొగాకు వాడకం తగ్గడానికి కొన్ని కారణాలు.

# దేశంలో సంస్కరణలు అవశ్యం...!



ఒకప్పుడు వస్తు మార్పిడి ద్వారా వ్యాపారం జరుగుతుండేది. రానురాను వ్యాపార లావాదేవీల్లో మార్పులు వచ్చి చెల్లింపుల పద్ధతి ఉనికిలోకి వచ్చింది. దేశం అభివృద్ధి పథంలో పయనిస్తున్నప్పటికీ మొత్తంగా చూస్తే ప్రపంచీకరణ వినాశనానికి దారితీస్తోంది. అదే సమయంలో ఏ రంగంలోనైనా ప్రజాహిత సంస్కరణలు చేపట్టకపోతే దేశం ఉనికి కోల్పోతుంది. దేశానికి వెన్నెముక రైతు. వారు బాగుంటేనే ఆర్థిక చక్రం బాగుంటుంది. రైతులను ప్రోత్సహిస్తే అంత అందరి వ్యాపారాలు అంత సజావుగా సాగుతాయి. ప్రతి లావాదేవీలోనూ రైతు పాత్ర ఎంతో కొంత ఉంటుంది. ఒకప్పుడు చేతిపనులకు, ఆదరణ లభించేది. అప్పటి పరిస్థితులు అలా ఉండేవి. ఇప్పుడు ప్రపంచీకరణ నేపథ్యంలో సులభంగా తయారు చేసే యంత్రాలు వచ్చినా క్వాలిటీ తగ్గింది. చేనేత కార్మికులు ఉపాధి కోల్పోయారు. 100 మంది చేసే పని ఒక్క యంత్రం చేస్తుంటే మిగతా వాళ్ల పరిస్థితి దారుణంగా ఉంటుంది. ఉపాధి కరువై కార్మికులు విలవిలలాడుతున్నారు. ఇక డిజిటల్ చెల్లింపులకు వస్తే అన్నీ మోసాలు, నిరక్షరాస్యులకు కష్టాలు. మెదడుకు పదును తగ్గింది. రెండు నాలుగులు ఎనిమిది అంటే కూడా కాలిక్యులేటర్ ఉపయోగించాల్సిన పరిస్థితి. ఎవరి చేతుల్లోనూ డబ్బు కనపడడం లేదు. ఇక కూలీల పరిస్థితి దారుణం. ఉపాధి పనులకు పోతున్నా ప్రభుత్వ చెల్లింపుల్లో అవకతవకలు ఉండటం, పనుల గుర్తింపులో లోపాలు ఉన్నాయి. ఉపాధి పనులను వ్యవసాయ పనులకు అనుసంధానిస్తే బాగుంటుంది. ఇక పాఠశాలల విషయానికి వస్తే ఒక ఉపాధ్యాయుడు, విద్యార్థి మధ్య సంబంధాలు లేకుండా పోతున్నాయి.

# దేశబాంధవి దువ్వూరి సుబ్బమ్మ...



శ్వేత జాతీయుల పాలనలో వారి అరాచకాలకు వ్యతిరేకంగా మహాత్మాగాంధీ ఇచ్చిన సందేశా లకు ప్రభావితమై ఎందరో వ్యక్తిగత ఇబ్బందులను అధిగమించి, బ్రిటీష్ పాలకులకు దేశం నుంచి వెళ్ల గొట్టాలనే ధృఢ సంకల్పంతో ముందుకు సాగారు. అలాంటి వారిలో, దువ్వూరి సుబ్బమ్మ గాంధీజీ ప్రశంసలు పొందిన వనిత. బ్రిటీష్ వారి బానిన సంకెళ్లను తెంచి భరతమాత దాస్య విముక్తి కోసం జరిగిన స్వతంత్ర పోరాటంలో ఎందరో మహిళలు స్ఫూర్తి దాయకంగా స్వాతంత్ర్యోద్య మంలో పాల్గొన్నారు. ఆ చారిత్రక ఉద్యమంలో పురుషులతో పాటు స్త్రీలు కూడా త్యాగాలకు సిద్ధ పడ్డారు. మహిళలు గడప దాటని కట్టుబాట్ల కాలంలో, భరతమాత దాస్య సంకెళ్లను తెంచేందుకు స్వతంత్ర పోరాటం చేస్తూ ఉద్యమానికి ఎందరో మహిళలు ఊపిరిగా నిలిచారు. అలనాటి మహిళలలో ప్రథమ వరసలో నిలిచే మహిళల్లో తొలి మహిళగాజైలుకు వెళ్ళిన ధీశాలి దువ్వూరి సుబ్బమ్మ. దేశ బాంధవి, సమాజ సేవకురాలు దువ్వూరి సుబ్బమ్మ 1880 - 31 మే, 1964) స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలుకు వెళ్ళిన తొట్ట తొలి తెలుగు మహిళ. స్త్రీ జనోద్ధరణకు కృషి చేస్తూనే సహాయ నిరాకర ణోద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో ఆమె చురుకుగా పాల్గొన్నారు. రాజమండ్రిలో స్త్రీలకు విద్య నేర్పించడం కోసం పాఠశాల, వసతిని ఏర్పాటు చేసారు. కాకినాడలో(1923) జరిగిన కాంగ్రెస్ సభలో సుబ్బమ్మ చేసిన సేవలకుగాను 'దేశ బాంధవి' అనే బిరుదు పొందారు. సుబ్బమ్మ తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామం గ్రామంలో 1880 సంవత్సరం నవంబరు నెలలో మధ్యతరగతి వైదిక బ్రాహ్మణ కుటుంబంలో మల్లాది సుబ్బావ ధాని దంపతులకు జన్మించారు. దువ్వూరి వెంకయ్యతో బాల్య వివాహం జరగడం, భర్తను చిన్నతనంలోనే కోల్పోయి బాల్య వితంతువు కాగా, ఆ రోజుల ఆచారమును బట్టి ఆమెకు కేశములు తీసివేసినా, తలకు ముసుగు వేసినా, సంప్రదాయ కట్టుబాట్లను కాదని, వేషంకు సిగ్గు పడక, ఆధ్యాత్మిక చింతగల వారైనా, స్వాతంత్ర్య పోరాటం లోనికి పరుగులు తీసిన ధీశాలి. ఆమె ఎన్నో లాఠీ దెబ్బల కోర్చింది. జైలుకు పలుమార్లు వెళ్ళింది. సుబ్బమ్మ స్వాతంత్ర్యోద్యంలో కాకినాడలో జరిగిన రాజకీయ సమావేశంలో పాల్గొని సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని లక్ష్యంగా బలపరు స్తూ అనర్గళంగా ప్రసంగాలు చేశారు. 1922 లో సహాయ నిరాకరణోద్యమంలో ప్రముఖ పాత్ర వహించారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాలలో పాల్గొన్నారు. ఒక సన్నివేశంలో ఈమెను ఆంగ్లేయులు నిర్బంధించి, క్షమాపణ చెబితే విడిచి పెడతామ నప్పుడు "నా కాలి గోరు కూడా అలా చేయదు" అని నిస్సంకోచంగా చెప్పిన ధైర్యవంతురాలు. సుబ్బమ్మ మహాత్మా గాంధీ ఆదేశాలపై ఖద్దరు ధరించారు.


# ఈఎల్స్ మంజూరులో...

# వివక్ష

వేసవి సెలవుల్లో టీచర్లు వారి కుటుంబ సభ్యులతో విహారయాత్రలకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటుంటారు. కానీ ఈ వేసవి సెలవుల్లో అమ్మ ఆదర్శ పాఠశాల పనుల నిమిత్తం టీచర్లను బడులకు హాజరు కావాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మే నెలలో సగం రోజులు ఎన్నికల శిక్షణ, విధులకు హాజరవ్వమంది. ఇక ప్రతీ ఏటా జూన్ 1వ తేదీ నుండి బడిబాట పేరుతో టీచర్లు బడికి వెళుతున్నారు. ఇటువంటి తరుణంలో.. ప్రస్తుతం ఆర్జిత సెలవులు (ఈఎల్స్) టీచర్ల మధ్య చర్చనీయాంశంగా మారింది. ఈఎల్స్ ఎటువంటి విధులకు హాజరైతే మంజూరు చేస్తారు, ఎన్ని మంజూరు చేస్తారు, ఎవరు మంజూరు చేస్తారనే విషయంపై అధికారులకు స్పష్టమైన అవగాహన ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఇతర ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఉద్యోగుల మాదిరిగా తమను కూడా నాన్ వెకేషన్ డిపార్ట్మెంట్‌గా పరిగణించాలని తదనుగుణంగా ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని ఉపాధ్యాయ సంఘాలు ఏళ్లుగా ప్రాతినిధ్యం చేసినా ప్రభుత్వం పెడచెవిన పెడుతూ వస్తున్నది. వేసవి సెలవుల్లో మేం పని చేయడానికి సిద్ధమని ఉపాధ్యాయ లోకం సంసిద్ధత వ్యక్తం చేస్తున్నా.. ప్రభుత్వం వారిని నాన్ వెకేషన్ డిపార్ట్మెంట్‌గా ప్రకటించకపోవడం విడ్డూరం. ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులకు పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల విధులకు హాజరైనందుకు ఈఎల్స్ మంజూరు చేస్తున్న ప్రభుత్వం.. అమ్మ ఆదర్శ పాఠశాల విధులకు హాజరైన ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఈఎల్స్ మంజూరు చేయడం లేదు. టీచర్లకి ఈఎల్స్ మంజూరు చేయకుండా.. వారికున్న వెకేషన్ పీరియడ్‌లో వారిని సర్వీసు వాడుకోవడం సమంజసం, సమర్థనీయం కాదు. వీరికి నిబంధనలను అనుసరించి ఆర్జిత సెలవులు మంజూరు చేసి టీచర్ల హక్కులను కాపాడాలి. ఈ విషయాన్ని రాష్ట్ర స్థాయి అధికారుల నుండి క్షేత్రస్థాయి అధికారుల వరకు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుర్తించాలి. 15 రోజులకు మించి ప్రభుత్వం బడులకు సెలవులు ప్రకటిస్తే ఆ కాలాన్ని వెకేషన్‌గా పరిగణించాలని తెలంగాణ సెలవు నిబంధనల్లోని ఫండమెంటల్ రూల్ 82 స్పష్టంగా సూచిస్తున్నది. ఈ ఏడాది ఏప్రిల్ 24 నుండి జూన్ 11 వరకు బడులకు వేసవి సెలవులు అంటే మొత్తం 49 రోజులు.. కానీ ఈఎల్స్ మంజూరు చేయడం లేదు. మేమేం పాపం చేశాం.. మాకెందుకు సెలవులు మంజూరు చేయరని సదరు టీచర్లు వాపోతున్నప్పటికీ ప్రభుత్వం వారిని పట్టించుకోవడం లేదు. పదో తరగతి సప్లమెంటరీకి సంబంధించిన విధులు నిర్వర్తించటానికి ఉన్నత పాఠశాలల్లో పనిచేసే ప్రధానోపాధ్యాయులకు, జూనియర్ రికార్డు అసిస్టెంట్‌కు, ఒకవేళ సీనియర్ అసిస్టెంట్ రికార్డు అసిస్టెంట్‌లు లేకపోతే పాఠశాలలో సీనియర్ స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడికి ఇలా మొత్తంగా ముగ్గురికి మించకుండా ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని పాఠశాల విద్యాశాఖ 2020లో విడుదల చేసిన ఉత్తర్వుల సంఖ్య 03 ద్వారా స్పష్టం చేసింది. అలాగే ఫండమెంటల్ రూల్ 82 ప్రకారం వెకేషన్ కాలంలో విధులు నిర్వహించాలని అధికారులు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసినట్లయితే తప్పకుండా ఆర్జిత సెలవులు మంజూరు చేయాలి. కానీ ప్రభుత్వ ఆదేశానుసారం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులను బడులకు హాజరు కమ్మని ఆదేశాలు జారీ చేసిన జిల్లా విద్యాశాఖ అధికారులు అట్టి ఉత్తర్వుల్లో ఈఎల్స్ అంశం ప్రస్తావించకపోవడం కొసమెరుపు. విధులు నిర్వర్తించాలని ఆదేశాలు జారీచేసిన అధికారులే ఈఎల్స్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు విడుదల చేసే అధికారం కలిగి ఉంటారు. ఫండమెంటల్ రూల్ 82 లోని సబ్ రూల్ 6 ప్రకారం 15 రోజుల కన్నా తక్కువగా వేసవి సెలవులు వాడుకునే విధంగా అధికారులు ఉత్తర్వులు జారీ చేసే ఆర్జిత సెలవులను దామాషా పద్ధతిలో కాకుండా మొత్తం 30 రోజులు (24o6) ఈఎల్స్ మంజూరు చేయాలని సూచిస్తున్నది. అలాగే ఎన్నికల విధులు, ఓపెన్ స్కూల్ పరీక్షల విధులకు హాజరైన ఉపాధ్యాయులకు కూడా ఆర్జిత సెలవులు జీవో.114 ద్వారా దామాషా పద్ధతిలో మంజూరు చేయాలని ఉత్తర్వులు తెలుపుతున్నాయి. కేవలం సబ్ రూల్ 15ను అనుసరించి హాజరైన విధులకు ప్రత్యేకంగా రెమ్యునరేషన్ పొందితే తప్ప ఈఎల్స్ మంజూరు చేయరన్న విషయాన్ని అధికారులు, ఉపాధ్యాయులు గుర్తించాలి. 2016 లో వేసవి సెలవుల్లో మధ్యాహ్న భోజన విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు నేటికీ ఆర్జిత సెలవులు మంజూరు చేయకపోవడం శోచనీయం. వెకేషన్ డిపార్ట్మెంట్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఏటా మంజూరు చేసే 6 ఈఎల్స్‌కు అదనంగా ఇటువంటి విధులకు సెలవులు మంజూరు చేసే బాధ్యత ప్రభుత్వానిదే. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు కూడా ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) ఇప్పటికే పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శికి ప్రాతినిధ్యం చేయడం జరిగింది. ప్రభుత్వం ఈ విషయంలో పునరాలోచించి నిబంధనలకు అనుగుణంగా ఆర్జిత సెలవులను మంజూరు చేయాలని అధికారులను ఆదేశిస్తారని ఆశిస్తున్నాం.

ఫండమెంటల్ రూల్ 82 లోని సబ్ రూల్ 6 ప్రకారం 15 రోజుల కన్నా తక్కువగా వేసవి సెలవులు వాడుకునే విధంగా అధికారులు ఉత్తర్వులు జారీ చేసే ఆర్జిత సెలవులను దామాషా పద్ధతిలో కాకుండా మొత్తం 30 రోజులు (24+6) ఈఎల్స్ మంజూరు చేయాలని సూచిస్తున్నది. అలాగే ఎన్నికల విధులు, ఓపెన్ స్కూల్ పరీక్షల విధులకు హాజరైన ఉపాధ్యాయులకు కూడా ఆర్జిత సెలవులు జీవో.114 ద్వారా దామాషా పద్ధతిలో మంజూరు చేయాలని ఉత్తర్వులు తెలుపుతున్నాయి.

# రష్యా స్టేట్ కౌన్సిల్‌కు కార్యదర్శిగా మాజీ బాడీ గార్డును నియమించిన పుతిన్......!




అధ్యక్షుడు పుతిన్ తన మాజీ వ్యక్తిగత భద్రతా గార్డు అలెక్సీ డ్యూమిన్‌ను రష్యా స్టేట్ కౌన్సిల్‌కు కార్యదర్శిగా నియమించారు. రష్యా స్టేట్ కౌన్సిల్ అనేది ఉన్నత స్థాయి ఫెడరల్ అధికారులు, ప్రాంతీయ గవర్నర్‌లతో కూడిన రాజ్యాంగ సంస్థ, వారు జాతీయ ప్రాముఖ్యత కలిగిన విషయాలపై అధ్యక్షుడికి సలహాలు ఇస్తారు. బుధవారం ఉదయం ప్రెసిడెంట్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ద్వారా అలెక్సీ డ్యూమిన్‌ను స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ది రష్యన్ ఫెడరేషన్ కార్యదర్శిగా నియమించినట్లు క్రెమ్లిన్ తన వెబ్‌సైట్‌లో ప్రకటించింది. సలహాదారుగా పలు జాతీయ విషయాలపై డ్యూమిన్ పుతిన్‌కు సలహాలు ఇవ్వనున్నారు. సైనిక-పారిశ్రామిక సముదాయానికి సంబంధించిన సమస్యలు, రక్షణ మంత్రిత్వ శాఖ విషయాలపై పుతిన్‌తో సమన్వయం చేస్తుంటారు. రష్యాలోని తులా ప్రాంతానికి ప్రాంతీయ గవర్నర్‌గా పనిచేసిన తర్వాత 51 ఏళ్ల డ్యూమిన్‌ను ఈ నెల ప్రారంభంలో క్రెమ్లిన్‌లోకి తీసుకువచ్చారు. గతంలో పుతిన్‌కు వ్యక్తిగత భద్రతా గార్డుగా ఉన్నారు. మాజీ డిప్యూటీ డిఫెన్స్ మంత్రి, రష్యా GRU మిలిటరీ ఇంటెలిజెన్స్ సర్వీస్ డిప్యూటీ హెడ్ అయిన డ్యూమిన్, మాజీ సలహాదారు సెర్గీ మార్కోవ్ స్థానంలో ఇప్పుడు పనిచేయనున్నారు.

# శాంతి శిఖరాగ్ర సదస్సును అడ్డుకునేందుకు రష్యా కుట్ర...



రష్యా ఉక్రెయిన్ యుద్ధానికి సంబంధించి వచ్చే నెలలో జరిగే అంతర్జాతీయ శాంతి శిఖరాగ్ర సదస్సుకు అంతరాయం కలిగించేందుకు రష్యా ఇప్పటికీ ప్రయత్నిస్తోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ ఆరోపించారు. ఈ సదస్సుకు దూరంగా ఉండాలని పలు దేశాలపై ఒత్తిడి తీసుకొస్తుందన్నారు. కీవ్‌లో మీడియాతో సమావేశంలో జెలెన్ స్కీ మాట్లాడారు. ఉక్రెయిన్ ప్రభుత్వం, పార్లమెంటు, ఇతర సంస్థల అధికారులు అతిపెద్ద భాగస్వామ్యాన్ని నిర్ధారించడానికి, శిఖరాగ్ర సమావేశాన్ని ప్రభావవంతంగా మార్చడానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఉక్రెయిన్‌లో శాంతిని మరింత దగ్గరగా తీసుకురావడానికి ఈ సదస్సు ఎంతో కీలకమని నొక్కి చెప్పారు. దాదాపు 100 దేశాలు, అంతర్జాతీయ సంస్థలు సంఘర్షణను పరిష్కరించడానికి ఇప్పటికే కృషి చేస్తున్నాయని తెలిపారు. రష్యా శిఖరాగ్ర సమావేశానికి అంతరాయం కలిగించే అవకాశం లేదని, కానీ అలా చేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తోందన్నారు. వివిధ దేశాలను బహిరంగంగానే బెదిరిస్తోందని వెల్లడించారు. ప్రపంచం ఉగ్రవాద రాజ్యానికి ఎక్కువ సమయం ఇవ్వడం వల్ల ఇటువంటి పరిణామాలే జరుగుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, స్విట్జర్లాండ్‌లోని బర్గెన్‌స్టాక్ రిసార్ట్‌లో జూన్ 15,16 తేదీల్లో ఉక్రెయిన్ శిఖరాగ్ర సమావేశం జరగనుంది. ఇందులో వందుకు పైగా దేశాలు పాల్గొనే అవకాశం ఉంది. భారత్‌కు కూడా ఈ సదస్సులో పాల్గొనేందుకు ఆహ్వానం అందింది. శాంతి ప్రక్రియకు సంబంధించిన అంశాలను చర్చిందచనున్నారు. అయితే రష్యా లేకుండా శాంతి ప్రక్రియ జరగబోదని పలు దేశాలు అభిప్రాయపడుతున్నాయి. అయితే సమావేశం ఏర్పాటులో భాగంగా ఏర్పాటు చేసిన ముందస్తు చర్చల్లో యూరోపియన్ యూనియన్, బ్రెజిల్, చైనా, ఇథియోపియా, సౌదీ అరేబియా వంటి దేశాల రాయబారులు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో వారికి పుతిన్ హెచ్చరికలు జారీ చేశారు.

# మరోసారి కిమ్ కవ్వింపు చర్యలు....



ఉత్తర కొరియా మరోసారి కవ్వింపు చర్యలకు పాల్పడింది. జపాన్ సముద్రం మీదుగా ఏకంగా 10 బాలిస్టిక్ క్షిపణులను గురువారం ప్రయోగించింది. దక్షిణ కొరియా, జపాన్ సైన్యాలు ఈ విషయాన్ని ధ్రువీకరించాయి. అంతేగాక ఈ చర్యలను తీవ్రంగా ఖండించాయి. ఉత్తర కొరియా తన తూర్పు సముద్రం వైపు స్వల్ప-శ్రేణి బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిందని దక్షిణ కొరియా జాయింట్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ తెలిపారు. 10 స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణులను గుర్తించామని, వీటి పరిధి సుమారు 350కిలోమీటర్లు ఉంటుందని వెల్లడించారు. ఈ క్రమంలో పసిఫిక్ మహాసముద్రంలో నిఘాను మరింత పెంచినట్టు తెలిపారు. ఈ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని పంచుకోవాలని జపాన్, అమెరికాలకు విజ్ఞప్తి చేశారు. నార్త్ కొరియా కవ్వింపు చర్యల నేపథ్యంలో జపాన్ తీర రక్షక దళం ఓ సముద్ర భద్రత సలహాను జారీ చేసింది. నౌకలు ఏవైనా పడిపోయిన వస్తువులను కనుగొంటే జాగ్రత్త వహించాలని కోరింది. జపాన్ కు వచ్చే నౌకలను సోదాలు చేయనున్నట్టు తెలిపింది. జపాన్‌కు చెందిన ప్రత్యేక ఆర్థిక మండలి వెలుపలి జలాల్లో ఈ క్షిపణులు పడిపోయాయని, భావిస్తున్నామని, నష్టానికి సంబంధించిన నివేదికలు ఏమీ లేవని జపాన్ ప్రధాని ఫుమియో కిషిడా తెలిపారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానాలను ఉల్లంఘించేలా చేస్తున్న ప్రయోగాలను ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. ఇటీవల ఉత్తర కొరియా చేపట్టిన నిఘా ఉపగ్రహ ప్రయోగం విఫలమైంది. ఈ నేపథ్యంలోనే మరోసారి బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించడం గమనార్హం. అంతకుముందు రోజు దక్షిణ కొరియా దృష్టిని మరల్చడానికి ఆ దేశ సరిహద్దుల్లో చెత్తతో నిండిన బెలూన్‌లను పంపించింది. దాదాపు 260 ఉత్తర కొరియా బెలూన్లు దేశంలోని వివిధ ప్రాంతాల్లో పడిపోయినట్లు సౌత్ కొరియా సైన్యం తెలిపింది. ఉత్తర కొరియా నుంచి ఎగురుతున్న వస్తువులను తాకొద్దని, వాటిని గుర్తించిన తర్వాత మిలిటరీకి లేదా పోలీసులకు ఫిర్యాదు చేయాలని పౌరులకు సూచించింది.

# పూరీలో అపశ్రుతి.. బాణసంచా పేలి ముగ్గురి మృతి



భువనేశ్వర్: ఒడిశాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పూరీలో అపశ్రుతి చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తూ జరిగిన బాణసంచా పేలుడులో ముగ్గురు మృతిచెందారు. మరికొంతమంది భక్తులకు గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి పూరీలోని నరేంద్ర పుష్కరిణిలో జగన్నాథుడి చందన ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు వందలాది మంది అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో కొంతమంది భక్తులు పటాసులు పేల్చారు. ఆ నిప్పురవ్వలు సమీపంలో బాణసంచా నిల్వ ఉంచిన చోట పడ్డాయి. దీంతో పెద్దఎత్తున పేలుడు సంభవించి దాదాపు 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా.. ముగ్గురు ప్రాణాలు విడిచారు. మృతుల్లో 15 ఏళ్ల బాలుడు కూడా ఉన్నాడు. ప్రాణాలు కాపాడుకునేందుకు కొంతమంది పుష్కరిణిలోకి దూకినట్లు అనుమానిస్తున్నారు. గురువారం ఉదయం అండర్ వాటర్ సెర్చింగ్ కెమెరాలతో గాలింపు చేపట్టారు. క్షతగాత్రులను పోలీసులు జిల్లా ఆసుపత్రికి తరలించారు. వారిలో కొంతమంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

# కోమాలో ఉన్న భర్త ఆస్తి అమ్మేందుకు భార్యకు హైకోర్టు అనుమతి



**చెన్నై :** భర్త కోమాలో ఉంటే అతడి ఆస్తి అమ్మేందుకు భార్యకు హక్కు ఉంటుందని మద్రాసు హైకోర్టు స్పష్టం చేసింది. అనారోగ్యంతో కోమాలోకి వెళ్లిన భర్త ఆస్తులకు తనను గార్డియన్‌గా నియమించాలంటూ మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ మేరకు తీర్పు వెలువరించింది. శశికళ అనే మహిళ ఈ పిటిషన్ దాఖలు చేశారు. తొలుత సింగిల్ జడ్జ్ బెంచ్ ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. చట్టంలో ఇందుకు అవకాశం లేదని స్పష్టం చేసింది. సివిల్ కోర్టును ఆశ్రయించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ తీర్పుపై శశికళ చేసుకున్న అప్పీలుపై జస్టిస్ స్వామినాథన్, జస్టిస్ బాలాజీల ధర్మాసనం విచారణ చేపట్టింది. చట్టంలో ఏ వెసులుబాటు లేకపోయినా మహిళ సంరక్షకురాలు అనేలా కోర్టు ఉత్తర్వులు ఇవ్వొచ్చని గతంలో కేరళ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను మద్రాసు హైకోర్టు ఈ సందర్భంగా ప్రస్తావించింది. భర్త ఆస్తుల నిర్వహణకు భార్యకు అనుమతిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను కొట్టేసింది. శశికళను తన భర్త శివకుమార్‌కు గార్డియన్‌గా నియమించి, రూ.కోటి విలువైన ఆస్తిని విక్రయించేందుకు అనుమతించింది. ఇందులో రూ.50 లక్షలు శివకుమార్‌పై ఫిక్స్డ్ డిపాజిట్ చేసి వచ్చే వడ్డీ వినియోగించుకోవచ్చని పేర్కొంది.

# షార్జీల్ ఇమామ్‌కు ఉపశమనం...!



**న్యూఢిల్లీ :** వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)కి వ్యతిరేకంగా జరిగిన నిరసనల సందర్భంగా రాజద్రోహ ప్రసంగాలు చేశారనే కేసులో విద్యార్థి నాయకుడు షార్జీల్ ఇమామ్‌కు కాస్త ఊరట లభించింది. ఢిల్లీ హైకోర్టు బుధవారం ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. అయితే, ఢిల్లీ అల్లర్ల కేసులో మాత్రం ఆయన జైలులోనే ఉండనున్నారు. ఈ కేసులో చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం ఆరోపణలతో కూడిన పెద్ద కుట్ర కేసులో అతను జైలులోనే గడపనున్నారు. ఈ మేరకు న్యాయమూర్తులు సురేష్ కుమార్ కైత్, మనోజ్ జైన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ఉత్తర్వులు ఇచ్చింది. షార్జీల్ ఇమామ్ జనవరి 28, 2020 నుంచి జైలులో ఉన్నారు. ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జేఎన్‌యూ)లో మాజీ స్కాలర్ షార్జీల్ ఇమామ్.. 2019లో జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీలో, 2020లో అలీఘర్ ముస్లిం యూనివర్సిటీలో వివాదాస్పద సీఏఏకు వ్యతిరేకంగా జరిగిన నిరసనల సందర్భంగా చేసిన ప్రసంగాలకు సంబంధించినది ఈ కేసు. ఫిబ్రవరి 17న ఢిల్లీ కోర్టు బెయిల్ నిరాకరించటంతో షార్జీల్ ఇమామ్ హైకోర్టును ఆశ్రయించారు. షార్జీల్ ఇమామ్ చట్టబద్ధమైన బెయిల్ దరఖాస్తుపై నిర్ణయం తీసుకోవాలని ఢిల్లీ హైకోర్టు జనవరి 30న ఇచ్చిన ఆదేశాలను ట్రయల్ కోర్టు అనుసరించింది. షార్జీల్ ఇమామ్ నాలుగు సంవత్సరాలు జైలులో గడిపినందున ఆయన చట్టబద్ధమైన బెయిల్‌కు అర్హుడని ఆయన తరఫు న్యాయవాది వాదించాడు. చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టంలోని సెక్షన్ 13 ప్రకారం దోషిగా తేలితే గరిష్టంగా ఏడేళ్ల శిక్ష పడే అవకాశం ఉన్నదని చెప్పారు. సీఆర్పీసీలోని సెక్షన్ 436ఏ ప్రకారం.. వ్యక్తులు కస్టడీలో ఉన్న నేరానికి నిర్దేశించిన గరిష్ట శిక్షలో సగానికి పైగా గడిపినట్టయితే వారిని జైలు నుంచి విడుదల చేయవచ్చు. ఆయన చట్టబద్ధమైన బెయిల్‌కు అర్హుడని ఆయన తరఫు న్యాయవాది వాదించాడు.

# థైరాయిడ్ సమస్య మహిళలకే వస్తుందా......!



థైరాయిడ్ సమస్య ప్రస్తుతం సర్వసాధారణంగా మారుతున్న వ్యాధి. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది ఈ వ్యాధితో బాధపడుతున్నారు. ఇది ఎవరినైనా, ఏ వయస్సులోనైనా ప్రభావితం చేస్తుంది. ముఖ్యంగా థైరాయిడ్ సమస్యను ఎక్కువగా మహిళలు ఎదుర్కొనే అవకాశం ఉంది. అవగాహన లేకపోవడం వల్ల చాలామంది తమకు థైరాయిడ్ సమస్య మొదలైంది అని మొదట్లో గుర్తించడం లేదు. దీనికి సంబంధించి ప్రజల్లో అనేక అపోహలు ఉన్నాయి. అటువంటి పరిస్థితిలో థైరాయిడ్ వ్యాధి ఏమిటి? దీని గురించి అపోహలు ఏమిటి? వ్యాధి గురించి నిజాలు ఏమిటి? ఈ రోజు తెలుసుకుందాం.. థైరాయిడ్ అనేది హార్మోన్ల వ్యాధి. దీనిని సకాలంలో గుర్తించి చికిత్స తీసుకోక పోతే సమస్యలు తీవ్రంగా ఉంటాయి. నిజానికి థైరాయిడ్ అనేది మెడ ముందు ఉండే చిన్న గ్రంథి. దీని పని హార్మోన్లను విడుదల చేయడం. అయితే అవసరమైన దానికంటే ఎక్కువ లేదా తక్కువ హార్మోన్లను విడుదల చేసినప్పుడు సమస్యలు మొదలవుతాయి. అవసరమైన దానికంటే ఎక్కువ హార్మోన్లను విడుదల చేయడం వల్ల హైపర్ థైరాయిడిజం.. అవసరమైన దానికంటే తక్కువ హార్మోన్లను విడుదల చేయడం వల్ల హైపోథైరాయిడిజం ఏర్పడుతుందని థైరాయిడ్ నియంత్రణ కోసం తీసుకోవాల్సిన ఆహారం థైరాయిడ్ సమస్య వస్తే బరువు పెరుగుతామనే ఒక అపోహ ప్రజల్లో ఉంది. అయితే ఇది పూర్తిగా నిజం కాదు. బరువు పెరగడం అనేది సాధారణ లక్షణం.. అదే విధంగా బరువు తగ్గడం కూడా జరగవచ్చు.థైరాయిడ్ జన్యుసంబంధమైన వ్యాధి అని అనుకుంటారు. అయితే థైరాయిడ్ సమస్య ఎవరికైనా, ఏ వయస్సులోనైనా సంభవించవచ్చు. దీనికి కారణం చెడు జీవనశైలి కూడా కావచ్చు.థైరాయిడ్ సమస్య మహిళల్లో మాత్రమే వస్తుంది అని ఎక్కువ మంది అనుకుంటున్నారు. అయితే ఈ సమస్య ఎవరికైనా రావచ్చు.థైరాయిడ్ ఉంటె లక్షణాలు స్పష్టంగా కనిపిస్తాయని అనుకుంటారు. అయితే కొన్నిసార్లు థైరాయిడ్ సమస్య బయటపడదు. అయితే ఆలోచనలో మార్పులు, చిరాకు, జుట్టు రాలడం వంటి చాలా సాధారణ లక్షణాలు కనిపిస్తే థైరాయిడ్ నిర్ధారణ కోసం పరీక్ష సహాయం తీసుకోవాలి.ఔషధం మాత్రమే ఈ వ్యాధిని నియంత్రించగలదని భావిస్తున్నారు. అయితే మందులతో పాటు మెరుగైన జీవనశైలితో ఈ వ్యాధిని నియంత్రించవచ్చు. థైరాయిడ్ సమస్య ఉన్నవారుక్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. తగినంత నిద్ర పోవాలి. ఒత్తిడిని నియంత్రించుకోవాలి. ఆహారం: అయోడిన్ అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలి. అయితే వైద్యుడిని సంప్రదించకుండా సొంతంగా ఏమీ చేయవద్దు. ఈ వ్యాధి వృద్ధులలో మాత్రమే వస్తుందని ఎక్కువమంది అనుకుంటున్నారు. అయితే మారిన జీవనశైలి కారణంగా ప్రస్తుతం అన్ని వయస్సుల వారు ఈ వ్యాధితో బాధపడుతున్నారు.

# ఈ ఆకులు ఆ సమస్యలకు బ్రహ్మాస్త్రం.....



కొత్తిమీరలో ఎన్నో ఔషధగుణాలు దాగున్నాయి. కొత్తిమీర ఆహారం రుచిని పెంచడమే కాకుండా ఆరోగ్యానికి మేలు చేస్తుందని వైద్య అధ్యయనాలు పేర్కొంటున్నాయి.. కొత్తిమీరను భారతీయ వంటలలో ఉపయోగించడం సర్వసాధారణం..దాదాపు ప్రతి కూరగాయల రుచిని మెరుగుపరచడానికి.. సువాసనతోపాటు తాజాగా కనిపించేలా చేయడానికి ఉపయోగిస్తారు. ఇది మాత్రమే కాదు, వెల్లుల్లి, అల్లం, పచ్చిమిర్చి, అనేక ఇతర మసాలా దినుసులను జోడించడం ద్వారా రుచికరమైన చట్నీ కూడా తయారు చేయవచ్చు.. అందుకే.. దీని పేరు వింటేనే ప్రజల నోళ్లలో నీళ్లు ఊరుతుంటాయి.. ప్రజలు అన్ని రకాల కూరగాయలతో పాటు నాన్ వెజ్ వంటలలో కూడా పచ్చి కొత్తిమీరను ఉపయోగిస్తారు. ఇలా దాదాపు ప్రతి వంటకానికి ఈ పచ్చి ఆకులే ప్రాణం. దాని రుచి, సువాసన అందరి మూడ్‌ని రిఫ్రెష్ చేస్తుంది. పచ్చి కొత్తిమీర ఆహారం రుచి, తాజాదనాన్ని పెంపొందించడమే కాకుండా అనేక ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది. పచ్చి కొత్తిమీరను ఆహారంలో చేర్చుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.. జీర్ణ సంబంధ సమస్యలతో ఇబ్బంది పడుతుంటే ఖచ్చితంగా పచ్చి కొత్తిమీరను మీ ఆహారంలో చేర్చుకోండి.డ్రై స్కిన్, ఎగ్జిమా వంటి సమస్యల నుండి ఉపశమనాన్ని అందిస్తుంది కొత్తిమీరలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. దాని సహాయంతో మీరు వేసవిలో మీ శరీరాన్ని సహజంగా డిటాక్స్ చేయవచ్చు.రక్తశుద్ధిలో సహాయపడుతుంది.

# క్యాన్సర్ రిస్క్ తగ్గిస్తున్న బ్రోకలీ!




క్యాన్సర్ ఎందుకు వస్తుంది? దీనికి గల ప్రమాదకారకాలు ఏంటి? అనే విషయాలపై ఇంకా పరిశోధనలు కొనసాగుతున్నాయి. ధూమపానం, వాయు కాలుష్యం, ఆస్బెస్టాస్, ఆల్కహాల్ వినియోగం, అతినీలలోహిత వికిరణం, హెలికోబాక్టర్ పైలోరీ ఇన్‌ఫెక్షన్, జీవనశైలి, అధిక శరీర బరువు, సరైన ఆహారం తీసుకోకపోవడం కారణంగా ఉన్నాయని ఇప్పటి వరకు గుర్తించారు. కాగా ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని ప్రయోగాలు చేస్తున్న శాస్త్రవేత్తలు.. బ్రోకలీ వినియోగం క్యాన్సర్ సంభావ్యతను తగ్గిస్తుందని ఇప్పటికే గుర్తించారు. అయితే తాజా అధ్యయనం దీని వల్ల కలిగే సైడ్ ఎఫెక్ట్స్‌పై దృష్టిపెట్టింది. దాదాపు 73వేల మంది శాస్త్రవేత్తలు ఇంతకు ముందు చేసిన అధ్యయనాలను సమీక్షించిన స్టడీ.. బ్రోకలీ తక్కువగా తీసుకుంటే క్యాన్సర్ రిస్క్ అధికంగా ఉందని తేల్చింది. తరచుగా తీసుకోవడం అనేక క్యాన్సర్‌ల నుంచి రక్షణ ప్రభావాన్ని అందించగలదని సూచిస్తుంది. అధిక బ్రోకలీ తీసుకోవడం అంటే కనీసం వారానికి ఒకసారి, గరిష్టంగా రోజుకు ఒకసారి తీసుకున్నా ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేవని గుర్తించింది. తక్కువ బ్రోకలీ తీసుకోవడం అంటే నెలకు కనీసం మూడు సార్లు అయినా ఆహారంలో చేర్చుకోకపోతే క్యాన్సర్ రిస్క్ ఫేస్ చేసే చాన్స్ ఉంటుందని హెచ్చరించింది. మొత్తానికి బ్రోకలీ వినియోగం సంపూర్ణ ప్రయోజనాలు ఇంకా తెలియాల్సి ఉండగా..మరిన్ని పరిశోధనలు అవసరం.

# నిమ్మ గడ్డితో ఎన్ని ప్రయోజనాలో...!




అప్పుడప్పుడు కొంతమంది అనుకోకుండా మూడ్ ఆఫ్ లోకి వెళుతుంటారు. ఆ మానసిక స్థితిని సెట్ చేసుకునేందుకు అనేక ప్రయత్నాలు చేస్తుంటారు. మానసిక స్థితి ఆఫ్‌లో ఉన్నప్పుడు తాజా అనుభూతిని కలిగించే మొక్కను ఇదివరకే కనుగొన్నారు. ఆ మొక్కల్లో ఒకటే నిమ్మ గడ్డి. నిమ్మ గడ్డి అనేక లక్షణాలను కలిగి ఉంది. దాని రిఫ్రెష్ సువాసన మానసిక స్థితిని మెరుగుపరచడమే కాకుండా అనేక ఇతర ప్రయోజనాలను కూడా ఉన్నాయి. ఈ నిమ్మ గడ్డిని హెర్బ్‌గా కూడా ఉపయోగిస్తారు. దాని నూనె అనేక ఆరోగ్య సమస్యలను నయం చేయడానికి, పరిమళ ద్రవ్యాల తయారీలో కూడా ఉపయోగిస్తారు. దీన్ని ఇంట్లో కూడా సులభంగా పెంచుకోవచ్చు. ప్రస్తుతానికి, నిమ్మ గడ్డి వల్ల కలిగే ప్రయోజనాలు, దానిని ఎలా ఉపయోగించవచ్చో తెలుసుకుందాం. నిమ్మగడ్డితో మానసిక ప్రశాంతత.. మీ మానసిక స్థితిని మెరుగుపరచడానికి నిమ్మ గడ్డి సువాసన బాగా పనిచేస్తుంది. దీని సువాసన వేసవిలో తలనొప్పి నుంచి ఉపశమనం కలిగిస్తుంది. మీరు దాని నూనెను ఆయిల్ డిఫ్యూజర్‌లో ఉంచి ఉపయోగించవచ్చు. ఇది మీ ఇంటిని అంతటా ఆహ్లాదకరమైన సువాసనను వ్యాప్తి చేస్తుంది. లెమన్ గ్రాస్ తో రోగనిరోధక శక్తి.. లెమన్ గ్రాస్ తో టీ తయారు చేసి తాగవచ్చు. ఒక కప్పు వేడి నిమ్మ గడ్డి టీని సిప్ చేయడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందంటున్నారు నిపుణులు. రోగనిరోధక శక్తిని పెంచడానికి ఇది ఒక రుచికరమైన మార్గం. జీర్ణ సమస్యలకు చెక్.. పొట్ట సంబంధిత సమస్యల నుంచి ఉపశమనం కలిగించడంలో నిమ్మగడ్డి రసం సహాయపడుతుంది. లెమన్ గ్రాస్ టీ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అపానవాయువు, తిన్న తర్వాత అసౌకర్యంగా అనిపించడం వంటి సాధారణ జీర్ణ సమస్యల నుండి ఉపశమనాన్ని అందిస్తుంది. చర్మ సౌందర్యానికి.. నిమ్మ గడ్డి ఆరోగ్యానికి మాత్రమే కాకుండా చర్మానికి కూడా మేలు చేస్తుంది. మొటిమలు, జిడ్డు చర్మంతో ఇబ్బంది పడే వారు తమ చర్మ సంరక్షణలో నిమ్మగడ్డిని చేర్చుకోవాలి. ఇది యాంటీ బాక్టీరియల్, సహజ ప్రక్షాళనగా పనిచేస్తుంది. ఈ నీళ్లతో ముఖం కడుక్కోవచ్చు లేదా గ్రైండ్ చేసి ఫేస్ ప్యాక్ లా వేసుకోవచ్చు. దాని రిఫ్రెష్ సువాసన మానసిక స్థితిని మెరుగుపరచడమే కాకుండా అనేక ఇతర ప్రయోజనాలను కూడా ఉన్నాయి. ఈ నిమ్మ గడ్డిని హెర్బ్‌గా కూడా ఉపయోగిస్తారు. దాని నూనె అనేక ఆరోగ్య సమస్యలను నయం చేయడానికి, పరిమళ ద్రవ్యాల తయారీలో కూడా ఉపయోగిస్తారు. దీన్ని ఇంట్లో కూడా సులభంగా పెంచుకోవచ్చు. ప్రస్తుతానికి, నిమ్మ గడ్డి వల్ల కలిగే ప్రయోజనాలు, దానిని ఎలా ఉపయోగించవచ్చో తెలుసుకుందాం. నిమ్మగడ్డితో మానసిక ప్రశాంతత.. మీ మానసిక స్థితిని మెరుగుపరచడానికి నిమ్మ గడ్డి సువాసన బాగా పనిచేస్తుంది. దీని సువాసన వేసవిలో తలనొప్పి నుంచి ఉపశమనం కలిగిస్తుంది.

# పుదీనా... అనారోగ్య సమస్యలకు చెక్...



వేసవిలో చాలా ఇళ్లలో పుదీనా చట్నీని ఇష్టపడుతుంటారు. అనేక రకాల పానియాలకు తాజా రుచిని కలిగించేందుకు పుదీనాను ఉపయోగిస్తుంటారు. పుదీనా రుచి, వాసన అద్భుతమైనది మాత్రమే కాదు, ఇది ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలను కూడా కలిగిస్తుంది. అయితే వేసవిలో, పుదీనా మిమ్మల్ని ఒకటి కాదు, రెండు కాదు అనేక సమస్యల నుండి కాపాడుతుంది. దీనితో పాటు వేసవిలో సంభవించే చర్మ సంబంధిత సమస్యల నుంచి కూడా ఉపశమనం కలిగిస్తుంది. పుదీనాలో శీతలీకరణ గుణాలు ఉండడమే కాకుండా ఇందులో మెగ్నీషియం, నియాసిన్, థయామిన్, ఐరన్, పొటాషియం, విటమిన్ ఎ, సి వంటి అనేక పోషకాలు కూడా ఉన్నాయి. కాబట్టి వేసవిలో పుదీనా మీకు ఏ ఆరోగ్య సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. జీర్ణక్రియ మెరుగు..వేసవిలో ప్రజలు చాలా జీర్ణ సమస్యలను ఎదుర్కొంటారు. పుదీనాతో అజీర్ణం, అసిడిటీ, గ్యాస్ పెయిన్, వికారం, వాంతులు వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. జీర్ణ సమస్యల నుంచి ఉపశమనం పొందడానికి, పుదీనా టీని తయారు చేసి త్రాగవచ్చు.శరీర ఉష్ణోగ్రత సమతుల్యంగా.. వేసవిలో, శరీర ఉష్ణోగ్రతను సమతుల్యం చేసే వాటిని తినడం మంచిది. ఎందుకంటే ఇది హీట్‌స్ట్రోక్‌ను నివారిస్తుంది. పుదీనా ఆకులు కడుపుని చల్లబరుస్తాయి. దీని కోసం పుదీనా సిరప్ తయారు చేసి త్రాగవచ్చు.తలనొప్పి నుంచి ఉపశమనం..వేసవిలో శరీరంలో వేడి పెరగడం వల్ల తరచూ తలనొప్పితో బాధపడుతుంటారు. దీనిని దూరం చేయడంలో పుదీనా కూడా ప్రభావవంతంగా పనిచేస్తుంది. వేసవిలో శరీర ఉష్ణోగ్రత పెరగడం వల్ల తలనొప్పి, ఒత్తిడి, ఆందోళన వంటి సమస్యలు ఎదురైతే పుదీనా సువాసన ఉపశమనం కలిగిస్తుంది. అంతే కాదు పుదీనా ఆకుల టీ ఉపశమనం కలిగిస్తుంది. చర్మ సమస్యలకు చెక్.. వేసవిలో చర్మం పై మొటిమల సమస్య పెరిగితే పుదీనా ఆకుల రసాన్ని అప్లై చేయవచ్చు. లేదా ఫేస్ ప్యాక్ లాగా చర్మ సంరక్షణలో ఉపయోగించవచ్చు. చర్మ సమస్యలను దూరం చేయడమే కాకుండా, చర్మానికి చల్లదనాన్ని అందిస్తుంది. అలాగే శరీరాన్ని, మనస్సును రిఫ్రెష్ చేస్తుంది.

# నీరు తగినంత తీసుకోకపోతే వచ్చే అనారోగ్య సమస్యలు..!



శరీరంలో నీటి శాతం తగ్గినప్పుడు రకరకాల సమస్యలు తలెత్తుతాయి. శరీరంలో నీరు తక్కువగా ఉండడంతో జాగ్రత్తలు తీసుకోకపోతే ఈ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.శరీరానికి తగినంత నీరు అందనప్పుడు శరీరంలో డీహైడ్రేషన్ ఏర్పడుతుంది. ఇది ప్రతి ఒక్కరినీ డీహైడ్రేట్ చేస్తుంది. అయితే, శరీరంలో నీరు లేకపోవడం వల్ల అనేక లక్షణాలు కనిపిస్తాయని నిపుణులు చెబుతున్నారు. తలనొప్పి: మీకు తీవ్రమైన తలనొప్పి ఉంటే, మీ శరీరం డీహైడ్రేట్ అయినట్లు తెలుసుకోండి. నీటి కొరత వల్ల.. శరీరం అలాంటి సంకేతాలను పంపుతుంది. ఈ సందర్భంలో, మెదడుకు రక్త ప్రసరణ, ఆక్సిజన్ లేకపోవడం వల్ల నిర్జలీకరణం సంభవిస్తుంది. ఆహార కోరికలు: మీరు నిర్జలీకరణానికి గురైనప్పుడు, ఆకలి, దాహం మధ్య వ్యత్యాసాన్ని మర్చిపోవడం సులభం. దాహం, ఆహారం కోసం ఆరాటపడటం, అతిగా తింటారు. దీని వల్ల మీ గొంతు కూడా ఎండిపోతుంది. దీని వల్ల అజీర్ణం, మలబద్ధకం సమస్యలు వస్తాయి. నోటి దుర్వాసన: ఇది నీటి కొరత వల్ల వస్తుంది. నోటి నుండి తరచుగా దుర్వాసన వస్తుంది. తక్కువ నీరు త్రాగడం వల్ల మీ గొంతు ఎండిపోతుంది. దీని వలన మీ నోటిలో బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇది ప్రతి ఒక్కరినీ డీహైడ్రేట్ చేస్తుంది. అయితే, శరీరంలో నీరు లేకపోవడం వల్ల అనేక లక్షణాలు కనిపిస్తాయని నిపుణులు చెబుతున్నారు. తలనొప్పి: మీకు తీవ్రమైన తలనొప్పి ఉంటే, మీ శరీరం డీహైడ్రేట్ అయినట్లు తెలుసుకోండి.

# వేరుశెనగలు వేయించి కాదు.....

ఉడికించిన వేరుశనగలను తీసుకుంటే అజీర్ణ సమస్యలు దూరమవుతాయి. ఇందులోని ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. హృద్రోగ సంబంధిత వ్యాధులను దూరం చేస్తుంది. మధుమేహ వ్యాధి నుంచి ఉపశమనాన్నిస్తుంది. వేయించిన వేరుశెనగల కంటే.. ఉడికించిన వేరుశెనగల్లో తక్కువ కెలోరీలు వుంటాయి. ఫలితంగా ఒబిసిటీకి దూరంగా వుండొచ్చు. స్థూలకాయం: ఉడకబెట్టిన వేరుశెనగలో ఉండే పోషకాలు మీ కడుపుని ఎక్కువసేపు నిండుగా ఉంచుతాయి. దీన్ని తినడం వల్ల మీకు వెంటనే ఆకలి అనిపించదు. ఉడకబెట్టిన వేరుశెనగను తినే వారి కడుపు నిండుగా ఉంటుంది. వారు తమ బరువును కూడా నియంత్రించగలుగుతారు. కొలెస్ట్రాల్‌ను నియంత్రిస్తుంది: ఉడికించిన వేరుశెనగలో ఉండే మోనోఅన్‌శాచురేటెడ్, పాలీఅన్‌శాచురేటెడ్ కొవ్వులు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. ఉడికించిన వేరుశెనగ తీసుకోవడం కొలెస్ట్రాల్ రోగులకు ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. జ్ఞాపకశక్తి: ఉడకబెట్టిన వేరుశెనగను



తీసుకోవడం వల్ల మీ జ్ఞాపకశక్తి బాగా ఉంటుందని నమ్ముతారు. ఇది మీ జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుంది. వేరుశెనగ విటమిన్ %జు% మంచి మూలంగా పరిగణించబడుతుంది. ఇది జ్ఞాపకశక్తికి ప్రయోజనకరంగా ఉంటుంది.




# మూడోసారి తండ్రి కాబోతున్న తమిళ స్టార్ నటుడు.?



కోలీవుడ్ నటుడు శివకార్తికేయన్ మూడోసారి తండ్రి కాబోతున్నాడు. ప్రస్తుతం ఈ వార్త సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతుంది. శివకార్తికేయన్ తన దగ్గరి బంధువైన ఆర్తి దాస్ ను 2010లో పెళ్లిచేసుకున్నాడు. ఇప్పటికే ఈ దంపతులకు ఆరాధన, గుగన్ దాస్ అని ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే చాలాకాలం తర్వాత ఈ జంట ముడో బిడ్డ కోసం ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. తాజాగా ఓ అభిమాని తన కొడుకు పుట్టినరోజు వేడుకకు శివకార్తికేయన్‌ను పిలువగా.. శివకార్తికేయన్ ఆయన భార్య ఆర్తి గెస్ట్?లుగా వెళ్లారు. అయితే ఆ వీడియోలో ఆర్తికి కాస్త పొట్ట ఉన్నట్లుగా కనిపించింది. దీంతో నెటిజన్లు, అభిమానులు అది బేబీ బంప్ అయి ఉండొచ్చని కామెంట్లు చేయడం మొదలుపెట్టారు. కాగా దీనిపై శివకార్తికేయన్ స్పందించాల్సి ఉంది.



# సస్పెన్స్‌కు తెర...

## 'పరువు' కోసమే పోలీసులతో గొడవపడిన నివేదా పేతురాజ్




ఈ మధ్య టాలీవుడ్ నటులు సినిమా ప్రమోషన్స్‌ను కొత్తగా ప్లాన్ చేస్తున్న విషయం తెలిసిందే. మొన్నటికి మొన్న నభా నటేష్, ప్రియదర్శి 'డార్లింగ్' అనే సినిమా ప్రమోషన్స్ కోసం గొడవ పడినట్లు నటించగా.. తాజాగా మరో నటి ఇలానే చేసింది. టాలీవుడ్ బ్యూటీ నివేదా పేతురాజ్‌కు సంబంధించి గురువారం ఒక వీడియో వైరల్ అయిన విషయం తెలిసిందే. కారులో వెళుతున్న నివేదా పేతురాజ్‌ను పోలీసులు ఆపి మేడం.. ఎలక్షన్ కోడ్ నడుస్తోంది. మేము మీ కారును చెక్ చేయాలని అనుకుంటున్నాం. ఒకసారి డిక్కీని ఓపెన్ చేయండి అని అనడంతో నివేదా కోపంతో ఊగిపోతూ పోలీసులపై అరిచింది. దీంతో ఈ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యింది. ఇక ఈ వీడియో చూసిన నెటిజన్లు కొందరు నివేదా డిక్కీలో ఏం దాచింది అంటూ కామెంట్స్ చేయగా మరికొందరు ఇది సినిమా స్టంట్ అని.. ప్రమోషన్స్‌లో భాగంగా చేసిన స్క్రిప్ట్ వీడియో అంటూ కామెంట్స్ చేస్తున్నారు. అయితే ఈ వీడియోపై తాజాగా క్లారిటీ ఇచ్చింది నివేదా పేతురాజ్. అందరూ అనుకున్నట్లుగానే ఇది సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా చేసినట్లు నివేదా ప్రకటించింది. నివేదా పేతురాజ్, నరేష్ అగస్త్య ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా వెబ్ సిరీస్ పరువు. ఈ సిరీస్‌కు సిద్దార్థ్ %-% రాజశేఖర్ సంయుక్తంగా దర్శకత్వం వహిస్తుండగా.. ప్రముఖ ఓటీటీ వేదిక జీ5లో నేరుగా విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా ఫస్ట్ లుక్‌తో పాటు ప్రీమియర్ తేదీని అనౌన్స్ చేశారు మేకర్స్. ఈ సిరీస్‌ను జూన్ 14 నుంచి స్ట్రీమింగ్ చేయనున్నట్లు జీ5 వెల్లడించింది. ఇక పరువు ఫస్ట్ లుక్ పోస్టర్ గమనిస్తే.. నివేదా పేతురాజ్, నరేష్ అగస్త్య అనుకోకుండా మర్డర్ కేసులో ఇరుక్కొని ఒక బాడీని డిక్కీలో దాచుతున్నట్లుగా పోస్టర్ ఉంది. ఇక క్రైమ్ థ్రిల్లర్‌గా వస్తున్న ఈ సిరీస్‌లో నాగబాబు కీలక పాత్ర పోషిస్తుండగా.. గోల్డెన్ బాక్స్ ఎంటర్‌టైనమెంట్ బ్యానర్‌పై సుస్మిత కొణిదెల నిర్మిస్తుంది.

# రూటు మార్చిన మెహ్రీన్...



నాని హీరోగా నటించిన కృష్ణ గాడి వీర ప్రేమ గాథ సినిమాతో టాలీవుడ్ లో అడుగు పెట్టిన పంజాబీ ముద్దుగుమ్మ మెహ్రీన్. కెరీర్ ఆరంభంలోనే ఈ అమ్మడు జూనియర్ మిల్కీ బ్యూటీ అంటూ పేరు దక్కించుకుంది. మొదటి సినిమాతో నటిగా మంచి పేరు దక్కించుకున్న ఈ అమ్మడు వరుసగా ఆఫర్లు సొంతం చేసుకుంది. తెలుగు తో పాటు హిందీ మరియు తమిళ భాషల్లో సినిమాలు చేస్తూ కెరీర్ లో ఒకానొక సమయంలో బిజీ బిజీగా గడిపింది. కానీ ఈ మధ్య కాలంలో ఈ అమ్మడికి పెద్దగా ఆఫర్లు రావడం లేదు. ముఖ్యంగా తెలుగు లో ఈ అమ్మడిని ఫిల్మ్ మేకర్స్ పట్టించుకోక పోవడంతో కెరీర్ ఖతం అయినట్లే అన్నట్లు ప్రచారం జరుగుతోంది.థాయ్ లో అంజమ్మ పెళ్లి ఏర్పాట్లు..! మెహ్రీన్ ఇక కనిపించదు అనుకుంటున్న ప్రతి సారి ఏదో ఒక సినిమాతో సందడి చేస్తూ వార్తల్లో నిలుస్తోంది. అయితే అదృష్టం కలిసి రాకపోవడంతో ముద్దుగుమ్మకి ఆఫర్లు వచ్చినా హిట్ అవ్వడం లేదు. అయినా కూడా సోషల్ మీడియాలో మాత్రం హిట్ బొమ్మలను షేర్ చేస్తుంది. రెగ్యులర్ గా ఇన్ స్టా ద్వారా మెహ్రీన్ షేర్ చేస్తున్న అందాల ఆరబోత ఫోటో షూట్స్ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఇంత అందంగా ఉన్న మెహ్రీన్ ను ఫిల్మ్ మేకర్స్ పట్టించుకోక పోవడం ఏంటి అన్నట్లు కొందరు కామెంట్స్ చేస్తున్నారు. తాజాగా సముద్రపు అందాలను తలదన్నేలా బ్లాక్ డ్రెస్ లో జల కన్య మాదిరిగా కనిపిస్తూ అందరి చూపు తనవైపు తిప్పుకుంది. బ్యూటీఫుల్ స్కిన్ టోన్ తో ఈ అమ్మడి యొక్క అందాల ఆరబోత అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. ముందు ముందు ఇంతటి అందం కు వరుసగా ఆఫర్లు రావాలని ఆశిస్తున్నాం అంటూ ఫ్యాన్స్ మాట్లాడుకుంటున్నారు.

# తెలుగు తేజం పాటను ఆవిష్కరించిన కెసిఆర్




ప్రముఖ సినిమాటోగ్రాఫర్ గరుడ వేగా అంజి దర్శకత్వంలో రాకింగ్ రాకేష్ హీరోగా 'కేశవ చంద్ర రమావత్' సినిమా తెరకెక్కుతోంది. రాకేష్ హీరోగానే కాకుండా ఈ సినిమాకి నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్, సాంగ్ మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇక తాజాగా ఈ సినిమా నుంచి మరో పాటను రిలీజ్ చేశారు. తెలంగాణా మాజీ సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ఈ పాటను రిలీజ్ చేయించడం విశేషం. . హైదరాబాద్ నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి సినిమా హీరో, నిర్మాత రాకింగ్ రాకేశ్ శుక్రవారం వెళ్లి ఆయన్ను కలుసుకున్నారు. రాకింగ్ రాకేశ్‌తోపాటు, మ్యూజిక్ డైరెక్టర్ చరణ్ అర్జున్, జోర్దార్ సుజాత, సింగర్లు విహ, గీత, రచయిత సంజయ్ మహేశ్‌లు కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా తెలుగు తేజం పాటను కేసీఆర్ ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు దామోదర్‌రావు, బీఆర్ఎస్ నేతలు బోయిన్‌పల్లి వినోద్ కుమార్, సంతోశ్ కుమార్, మధుసుధనచారి, దేశపతి శ్రీనివాస్, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

# సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించిన ఫైజర్...




**హైదరాబాద్ :** హైదరాబాదులోని యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీలో అడల్ట్ వ్యాక్సినేషన్ కోసం ప్రత్యేక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సిఓఈ)ని ప్రారంభించేందుకు ఫైజర్ ఇండియా, యశోద హాస్పిటల్స్ భాగస్వామ్యం చేసుకున్నాయి.రోగుల సంరక్షణను మెరుగు పరచాలనే లక్ష్యంతో ప్రారంభించిన ఈ సిఓఈ ను సమాజం అంతటా వయోజన టీకా సంపూర్ణ కవరేజీని నిర్ధారించడానికి తీర్చిదిద్దారు. ఈసందర్భంగా యశోద హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి మాట్లాడుతూ... యశోద హాస్పిటల్స్ వద్ద తాము వ్యాధి నివారణ, టీకాలు వేయడంలో ముందంజలో ఉండటానికి ప్రయత్నిస్తున్నామన్నారు. టీకాలు వేయించుకోవటం కీలకం. అది బాల్యంలో మాత్రమే కాదు, ఒక వ్యక్తి జీవితాంతం తప్పనిసరన్నారు. మరీ ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వ్యక్తులు, వృద్ధులతో సహా రోగ నిరోధక శక్తి తక్కువగా వున్న వ్యక్తులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఫైజర్ వ్యాక్సిన్స్ డైరెక్టర్ మెడికల్ అఫైర్స్ డాక్టర్ సంతోష్ టౌర్ మాట్లాడుతూ%%. వ్యాక్సిన్ సైన్స్, వైద్య అభివృద్ధి పరంగా దశాబ్దాల నైపుణ్యంతో, ఇన్ఫెక్షన్ నుండి సమాజాన్ని రక్షించడానికి, ప్రజారోగ్యాన్ని మెరుగు పరచడానికి వ్యాక్సినేషన్ వేగవంతం చేయడం ముఖ్యమనే తమ నిబద్ధత పట్ల ఫైజర్ స్థిరంగా ఉందన్నారు. నివారణ ఆరోగ్యానికి నాయకత్వం వహించడంపై దృష్టి సారించి, యశోద హాస్పిటల్స్‌తో తమ భాగస్వామ్యం ప్రబలంగా ఉన్న వ్యాక్సిన్-నివారించగల వ్యాధుల నుండి ముఖ్యంగా శ్వాసకోశ వ్యాధుల నుండి సమర్థవంతమైన రక్షణను నిర్ధారించడానికి పెద్దలకు వ్యాక్సినేషన్‌ను విస్తరించే లక్ష్యం పునరుద్ఘాటిస్తుందన్నారు.

# రాంకీ ఇన్‌ఫ్రాకు రూ.57.5 కోట్ల లాభాలు



**హైదరాబాద్ :** వచ్చే ఆరు మాసాల్లో రూ.280 కోట్ల నిధులు సమీకరించనున్నామని రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వైఆర్ నాగరాజు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ సంస్థ చీఫ్ ఫైనాన్సియల్ ఆఫీసర్ ఎన్ఎస్ రావుతో కలిసి రాంకీ ఇన్‌ఫ్రా ఆర్థిక ఫలితాలను వెల్లడించారు. ఆ వివరాలు.. గడిచిన ఆర్థిక సంవత్సరం (2023-24) మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో కంపెనీ నికర లాభాలు 94.67 శాతం తగ్గి రూ.57.5 కోట్లుగా నమోదయ్యాయని ఎన్ఎస్ రావు తెలిపారు. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.1,077.08 కోట్ల లాభాలు ఆర్జించిందన్నారు. ఇదే సమయంలో రూ.576.43 కోట్లుగా ఉన్న కంపెనీ రెవెన్యూ గడిచిన క్యూ4లో 0.83 శాతం పెరిగి 581.19 కోట్లకు చేరిందన్నారు. ఆర్థిక సంవత్సరం 202324 రాంకీ ఇన్‌ఫ్రా నికర లాభాలు 73.01 శాతం తగ్గి రూ.307.79 కోట్లుగా చోటు చేసుకున్నాయని తెలిపారు. సంస్థ వద్ద రూ.9,300 కోట్ల ఆర్డర్ బుక్ ఉందన్నారు. బుధవారం బిఎస్ఇలో ఆ సంస్థ షేర్ 7.66 శాతం పెరిగి రూ.527.85 వద్ద ముగిసింది.

# హెచ్‌డీఎఫ్‌సీ కీలక నిర్ణయం..




దేశంలో బ్యాంకులు కొత్త కొత్త మార్పులు చేస్తుంటాయి. యూపీఐ లావాదేవీలు సైతం భారీగానే పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో దేశంలో అతిపెద్ద ప్రైవేటు రంగ బ్యాంకు అయిన హెచ్‌డీఎఫ్‌సీ కీలక నిర్ణయం తీసుకుంది.తక్కువ మొత్తంలో యూపీఐ లావాదేవీలు చేస్తే SMS అలర్ట్ అందించబోమని స్పష్టం చేసింది. ఈ మేరకు తన వినియోగదారులకు సందేశాలను పంపింది బ్యాంకు. ఈ నిబంధన జూన్ 25వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని పేర్కొంది. 100 రూపాయల కంటే తక్కువ ఉన్న చెల్లింపులపై ఎస్ఎంఎస్ అందుకోలేరని తెలిపింది. అలాగే రూ.500 కంటే తక్కువ ఉన్న డిపాజిట్లపై కూడా ఎస్ఎంఎస్ అలర్ట్ ఉండబోదని తెలిపింది. వినియోగదారులు వంద కంటే ఎక్కువ చెల్లింపులు, రూ.500 కంటే ఎక్కువ డిపాజిట్లకు మాత్రమే ఎస్ఎంఎస్ అలర్ట్ అందుకుంటారని తెలిపింది. కస్టమర్ల నుంచి అందిన ఫీడ్‌బ్యాక్ మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు బ్యాంకు తెలిపింది. యూపీఐ యాప్‌ల నుంచి నోటిఫికేషన్లు వస్తున్న నేపథ్యంలో చిన్న మొత్తం లావాదేవీలకు ప్రత్యేకంగా అలర్ట్‌లు అవసరం లేదని పలువురు ఖాతాదారుల నుంచి ఫీడ్ బ్యాంక్ ద్వారా తెలియజేశారని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఇదిలా ఉండగా చిన్న చిన్న లావాదేవీలకు సందేశాలు పంపడం వల్ల కోట్లాది ఎస్ఎంఎస్‌లు కస్టమర్లకు చేరుతున్నాయని, దీని కోసం పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోందని బ్యాంకు వెల్లడించింది. ఇలా చిన్న పాటి లావాదేవీలకు సందేశాలు నిలిపివేయడం వల్ల కొంత డబ్బు ఆదా అవుతుందని బ్యాంకు అభిప్రాయపడింది. అలాగే బ్యాంకు ఖాతాదారులు తమ ప్రైమరీ ఈ-మెయిల్‌ను అప్‌డేట్ చేసుకోవాలని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సూచించింది. తాజా నిర్ణయంతో హెచ్‌డీఎఫ్‌సీకి ఆ మేరకు కొంత నిర్వహణ వ్యయం తగ్గనుంది. మరోవైపు ఖాతాదారులంతా తమ ప్రైమరీ ఈమెయిల్‌ను అప్‌డేట్ చేసుకోవాలని బ్యాంకు సూచించింది.


# ఐబీఏఐ లక్ష్యం సార్వత్రిక బీమా..



హైదరాబాద్: బీమా బ్రోకర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా బీమా వితారక్ మంథన్ సందర్భంగా ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియాతో చర్చా సెషన్ లో నిమగ్నమైంది.ఐబీఏఐకి బీమా అవగాహనను పెంపొందించడం, ఉత్పత్తులలో ఆవిష్కరణలను ప్రోత్సహించడం, బీమా రంగంలో కెరీర్ అవకాశాలను పెంపొందించడం లక్ష్యంగా ఐబిఏఐ దాని ప్రతిపాదనలు సమర్పించింది.


భారతదేశ సాధారణ బీమా ప్రీమియంలలో 35శాతం మొత్తంగా 20శాతం నిర్వహించే బ్రోకర్ల గణనీయమైన సహకారాన్ని గుర్తిస్తూ, బీమా వ్యయాన్ని చెల్లుబాటు అయ్యే కార్పొరేట్ సామాజిక బాధ్యతగా గుర్తించడం, రాష్ట్ర స్థాయి బీమా కమిటీలలో బ్రోకర్లను చేర్చడం, పరిశ్రమ-నిర్దిష్ట పరిష్కారాలు ప్రోత్సహించడం వంటి సూచనలను ప్రతిపాదించింది. ఐబీఏఐ వైస్ ప్రెసిడెంట్ నరేంద్ర భరింద్వాల్ మాట్లాడుతూ%%. భారతదేశ అభివృద్ధి పథం ఆర్థిక సేవల రంగం, ముఖ్యంగా బీమా పరిశ్రమ మూలస్థంభంగా ముందుకుసాగుతుందన్నారు. భారతదేశాన్ని అభివృద్ధి చేయడం కోసం మేము కృషి చేస్తున్నప్పుడు బీమా ఉత్పత్తులు సులభంగా అందుబాటులో ఉండటం, సహేతుకమైన ధర, మన ప్రజల విస్తృత శ్రేణి డిమాండ్లకు సరిపోవడం చాలా కీలకమన్నారు. బీమా కవరేజీ గురించి అవగాహన ఐబీఏఐ ఐదు గ్రామాలను దత్తత తీసుకుందన్నారు. వెనుకబడిన ప్రాంతాలకు బీమా అందించడంలో ఇది మా అంకితభావాన్ని చూపిస్తుందన్నారు. ఐబీఏఐ బీమా పరిశ్రమలో నిర్మాణాత్మక సంస్కరణలను ప్రోత్సహించడానికి, 2047కి ముందు అందరికీ బీమా లక్ష్యాన్ని సాధించడానికి ఐసాక్షి ఏఐ అండ్ ఇతర సంబంధిత పార్టీలతో సన్నిహితంగా సహకరించడానికి కట్టుబడి ఉందన్నారు. సమావేశం ముగింపులో చైర్పర్సన్ సూచించిన ఆలోచనలను విజయవంతంగా అమలు చేయడానికి, భారతదేశంలో బీమా పరిశ్రమ శ్రేయస్సుకు హామీ ఇవ్వడానికి బ్రోకర్ కమ్యూనిటీతో నిరంతర సహకారం కోసం పిలుపునిచ్చారు.

# కోటక్ బ్యాంకు సర్వీస్ ఛార్జీల్లో భారీ మార్పులు..!




మన ఆర్థిక లావాదేవీలన్ని బ్యాంకుల ద్వారానే జరుగుతాయి. పొదుపు చేయాలన్నా, వివిధ పథకాలలో పెట్టుబడి పెట్టాలన్నా ఖాతా అనేది చాలా అవసరం. ఉద్యోగులకు ప్రతి నెలా జీతాలు బ్యాంకు ఖాతాలలోనే జమ అవుతాయి. ప్రస్తుతం వివిధ ప్రభుత్వ పథకాల నుంచి లభించే ప్రయోజనాన్ని కూడా దానిలోనే వేస్తున్నారు. ఆఖరికి ఉపాధి కూలీలకు ఇచ్చే వేతనం కూడా బ్యాంకు ఖాతాలోనే జమ అవుతుంది. దేశంలో అనేక ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులున్నాయి. వీటితో పాటు పోస్టాఫీసుల్లోనూ ఖాతాలను ప్రారంభించవచ్చు. ప్రజలను ఆకర్షించడానికి ముఖ్యంగా బ్యాంకులు తమ ఖాతాదారులకు అనేక రాయితీలు ప్రకటిస్తాయి. ఈ నేపథ్యంలో ప్రైవేటు రుణదాత అయిన కోటక్ మహీంద్రా బ్యాంకు సేవింగ్స్, శాలరీ ఖాతాలపై రుసుములను సర్దుబాటు చేసింది. ఆ వివరాలను తెలుసుకుందాం.సేవింగ్స్, శాలరీ ఖాతాలపై రెండు సేవలకు ఛార్జీలను కోటక్ మహీంద్రా బ్యాంక్ సవరించింది. ఇవి మే ఒకటో తేదీ నుంచే అమలులోకి వచ్చాయి. బ్యాంక్ సగటు బ్యాలెన్స్, నగదు, ఏటీఎమ్ లావాదేవీల పరిమితులు, స్టాండింగ్ ఇన్‌స్ట్రక్షన్ వైఫల్యాల కోసం రుసుము, ఉచిత చెక్‌బుక్‌ల పరిమితి కోసం ప్రమాణాలను అప్‌డేట్ చేసింది. సగటు బ్యాలెన్స్ ప్రమాణాలకు సంబంధించి.. సంకల్ప్ సేవింగ్స్ ఖాతాకు సంబంధించి సెమీ అర్బన్, రూరల్ ప్రాంతాలలో రూ.2,500 ఉండాలి.రోజువారీ పొదుపు ఖాతాకు.. మెట్రో, అర్బన్ ప్రాంతాలలో రూ.15 వేలు, సెమీ అర్బన్ ప్రాంతాలలోరూ. 5 వేలు, గ్రామాలలో రూ. 2,500 ఉండాలి.ఉచిత నగదు లావాదేవీ పరిమితులు.. రోజువారీ సేవింగ్స్, జీతం ఖాతా, ప్రో సేవింగ్స్, క్లాసిక్ సేవింగ్స్ ఖాతాలకు సంబంధించి ఐదు లావాదేవీలు ఉచితం, అలాగే నెలకు రూ. 2 లక్షలకు పరిమితం చేశారు.ప్రైవీ నియాన్/మాక్సిమా ప్రోగ్రామ్‌లకు ఇప్పుడు ఏడు ఉచిత లావాదేవీలు చేయవచ్చు. రూ. నెలకు 5 లక్షల వరకూ అవకాశం ఉంది.సోలో సేవింగ్స్ ఖాతాకు సంబంధించి ఒక ఉచిత లావాదేవీ, లేదా నెలకు రూ.10 వేలకు తగ్గించారు. ఏటీఎం లావాదేవీల పరిమితులు.. రోజువారీ పొదుపులు, క్లాసిక్ సేవింగ్స్, ప్రో సేవింగ్స్, ఏస్ సేవింగ్స్, ప్రైవీ ప్రోగ్రామ్‌లకు సంబంధించి ఉచిత లావాదేవీల వివరాలు ఇలా ఉన్నాయి. కోటక్ ఏటీఎంలో నెలకు ఏడు, ఇతర బ్యాంకుల ఏటీఎంలలో నెలకు ఏడు, అలాగే కోటక్, ఇతర బ్యాంకులకు ఏటీఎంలలో నెలకు గరిష్ఠంగా 30 లావాదేవీలు జరపవచ్చు.ఎవిర్ డే శాలరీ, ఎడ్జ్ శాలరీ ఖాతాలకు సంబంధించి కోటక్ ఏటీఎంలలో నెలకు పది లావాదేవీలు చేయవచ్చు. ఇతర బ్యాంకుల ఏటీఎమ్ లలో ఎలాంటి మార్పు లేదు. అపరిమిత ఉచిత లావాదేవీలు కొనసాగించవచ్చు. స్టాండింగ్ ఇన్‌స్ట్రక్షన్ ఫెయిల్యూర్ ఫీజు.. అన్ని పొదుపు, జీతం పథకాలపై ప్రతి లావాదేవీకి రూ.200 చొప్పున కొత్త రుసుము విధిస్తారు. గతంలో ఇవి లేవు. చెక్ బుక్ లిమిట్.. సోలో సేవింగ్స్ ఖాతాదారులకు గతంలో ఏడాదికి 25 ఉచిత చెక్ లీవ్‌లు ఉండేవి. వాటిని ఐదుకు తగ్గించారు.

# వరుస నష్టాలు... కారణమిదే.......!



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా మూడు రోజుల నుంచి నష్టాల్లో ముగుస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాలు కారణంగా బుధవారం సూచీలపై ప్రభావం చూపించింది.సెన్సెక్స్ 667 పాయింట్లు నష్టపోయి 74,502 దగ్గర ముగియగా.. నిఫ్టీ 183 పాయింట్లు నష్టపోయి 22,700 దగ్గర ముగిసింది. సెన్సెక్స్ సూచీలో భారతీ ఎయిర్‌టెల్, ఐటీసీ, కోటక్ మహీంద్రా బ్యాంక్, సన్‌ఫార్మా, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు లాభాల్లో కొనసాగగా.. ఎం అండ్ ఎం, ఎన్‌టీపీసీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, టెక్ మహీంద్రా, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, పవర్‌గ్రిడ్, టాటా మోటార్స్, ఏషియన్ పెయింట్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌యూఎల్, ఎల్ అండ్ టీ షేర్లు నష్టాల్లో కొనసాగాయి. వాస్తవానికి సార్వత్రిక ఎన్నికల ఫలితాలు స్టాక్ మార్కెట్లపై ప్రభావం చూపిస్తాయని నిపుణులు భావించారు.

# ఎన్నికల చివరి దశ ముందు అమ్మకాల ఒత్తిడి..



ఎన్నికల చివరి దశకు ముందు అమ్మకాల ఒత్తిడి మధ్య భారత బెంచ్ మార్క్ సూచీలు బుధవారం ట్రేడింగ్ సెషన్ లో భారీ నష్టాలను చవిచూశాయి. ల నిఫ్టీ 50 ఇండెక్స్ 183 పాయింట్లు నష్టపోయి 22,704.7 వద్ద ముగియగా, బిఎస్ఇ సెన్సెక్స్ 667 పాయింట్లు నష్టపోయి 74,502.90 వద్ద స్థిరపడింది. నేటి మార్కెట్ లో.. నిఫ్టీ స్మాల్ క్యాప్ 100, నిఫ్టీ స్మాల్ క్యాప్ 250, నిఫ్టీ మైక్రోక్యాప్ 250 మినహా అన్ని సూచీలు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొని నష్టాలలో ముగిశాయి. నిఫ్టీ సెక్టోరల్ ఇండెక్స్ లలో.. నిఫ్టీ మీడియా, మెటల్, ఫార్మా, హెల్త్‌కేర్ లు లాభపడగా.. మిగితా అన్ని రంగాల సూచీలు నష్టాలతో ముగిశాయి. నిఫ్టీ 50లో నేడు టాప్ గెయినర్లుగా హిందాల్కో, దివీస్ ల్యాబ్, పవర్ గ్రిడ్, బజాజ్ ఆటో, సిప్లాలు వరుసగా ఉన్నాయి. ఐకమరోవైపు., టాప్ లూజర్లలో హెచ్‌డిఎఫ్‌సి లైఫ్, ఎస్‌బిఐ లైఫ్, టెక్ మహీంద్రా, టాటా కన్స్యూమర్స్, బజాజ్ ఫిన్‌సర్వ్ లు వరుసగా ఉన్నాయి. బుధవారం సెషన్ లో.. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో మొత్తం 2,715 స్టాక్‌లు ట్రేడ్ అవ్వగా.. 1,124 షేర్స్ లాభపడగా., 1,481 షేర్స్ క్షీణించాయి. అలాగే 110 షేర్స్ లో ఎటువంటి మారలేదు. ఇక బీఎస్ఈ మిడ్ క్యాప్ ఇండెక్స్ 0.28 శాతం క్షీణించగా, బీఎస్ఈ స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.29 శాతం పెరిగింది. ప్రపంచ మార్కెట్లలో, యెన్, యూరోలకు వ్యతిరేకంగా యూఎస్ డాలర్ బలపడింది. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ఫ్యూచర్స్ బ్యారెల్‌కు 84.78 డాల్లర్స్ కి పెరిగాయి. ప్రస్తుతం 1 డాలర్ విలువ 83. 33 రూపాయలుగా కొనసాగుతుంది.

## హీట్‌వేవ్‌పై జాతీయ ఎమర్జెన్సీ ప్రకటించండి

# : రాజస్థాన్ హైకోర్టు



దేశంలో ప్రస్తుతం సాగుతున్న హీట్‌వేవ్ దృష్టా జాతీయ ఎమర్జన్సీ ప్రకటించవలసిందని కేంద్రానికి రాజస్థాన్ హైకోర్టు విజ్ఞప్తి చేసింది. వారాలుగా సాగుతున్న మండు వేసవిలో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారని హైకోర్టు తెలిపింది. భారత్ దుర్భరమైన హీట్‌వేవ్‌ను చవి చూస్తున్నది. పలు నగరాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదు అవుతోంది. మండే ఎండల నుంచి ప్రజల రక్షణకు అధికారులు సముచిత చర్యలు తీసుకోలేకపోయారని కోర్టు వ్యాఖ్యానించింది. 'హీట్‌వేవ్ రూపంలో దుర్భర వాతావరణ పరిస్థితుల కారణంగా ఈ నెలలో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు' అని కోర్టు తెలిపింది. 'మనం తరలిపోవడానికి మరొక గ్రహం లేదు & మనం ఇప్పుడు కఠిన చర్య తీసుకోకపోతే మన భావి తరాల వృద్ధిని చూసే అవకాశాన్ని కోల్పోతాం' అని కోర్టు పేర్కొన్నది. ప్రస్తుత హీట్‌వేవ్, భవిష్యత్తులో తలెత్తే అటువంటి పరిస్థితుల గురించి హైకోర్టు అప్రమత్తం చేస్తూ, వాటిని 'జాతీయ విపత్తులు'గా భారత్ ప్రకటించడం ప్రారంభించాలని సూచించింది. వరదలు, తుపానులు, ప్రకృతి వైపరీత్యాలలో వలె అత్యవసర సహాయం సమీకరణకు ఇది వీలు కల్పిస్తుందని కోర్టు పేర్కొన్నది.

# చెన్నైలో తల్లిపాలతో వ్యాపారం..

## 200 మి.లీ.కు వెయ్యి రూపాయలు!



తమిళనాడు రాజధాని చెన్నైలో తల్లిపాల వ్యాపారం బట్టబయలైంది. డబ్బాల్లో తల్లిపాలను భద్రపరిచి.. 200 మిల్లీ లీటర్లకు వెయ్యి రూపాయలకు విక్రయిస్తున్నట్లుగా అధికారులు గుర్తించారు. ఈ దందా చేస్తున్న నలుగుర్ని అదుపులోకి తీసుకున్నారు. తల్లిపాల వ్యాపారంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిషేధం ఉన్నప్పటికీ.. కొంతమంది అక్రమంగా ఈ దందాను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో స్థానికులు ఫిర్యాదు చేయడంతో అప్రమత్తమైన ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ అధికారులు తనిఖీలు చేపట్టారు. చెన్నై మహానగరంలోని మాధవరంలో ముత్తయ్యకు చెందిన ఓ వ్యాక్సిన్ స్టోర్‌పై దాడి చేసిన ఉన్నతాధికారులు తల్లి పాలను విక్రయిస్తున్నట్లుగా గుర్తించారు. ప్రోటీన్ పౌడర్ విక్రయానికి లైసెన్స్ తీసుకుని ఆ ముసుగులో తల్లిపాలను విక్రయిస్తున్నట్లు తెలుసుకున్నారు. 50 బాటిళ్ల తల్లిపాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఆ బాటిళ్లను గిండీలోని కింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ అండ్ రీసెర్చ్‌కు పంపించారు. ముత్తయ్య తల్లిపాలను ఎలా సేకరించాడు? ఎన్ని రోజుల నుంచి ఈ వ్యాపారం చేస్తున్నారనే దానిపై అధికారులు దృష్టి సారించారు. ఈ క్రమంలోనే తల్లి పాలను దానం చేసే మహిళల పేర్లు, ఫోన్ నంబర్లతో కూడిన ఓ బుక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆ నోట్‌బుక్‌లో ఉన్న నంబర్లకు ఫోన్ చేసి కూడా వివరాలు తెలుసుకుంటున్నట్లు సమాచారం. తల్లిపాల విక్రయాలపై ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నిషేధం విధించిందని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు. తల్లిపాలను దీర్ఘకాలం నిల్వ చేయడం వల్ల సూక్ష్మజీవులు, బ్యాక్టీరియా పెరిగి అనారోగ్య సమస్యలు వస్తాయని చెప్పారు. అలాగే తల్లిపాలలో ఉండే సహజ ప్రోటీన్లు కూడా నశిస్తాయని పేర్కొన్నారు. అందుకే తల్లిపాలను నిల్వ చేసి అమ్మడాన్ని నిషేధించారని వివరించారు.

# కేసీఆర్‌పై దుష్ప్రచారం..


## 16 మీడియా ఛానళ్లపై బీఆర్ఎస్ ఫిర్యాదు



కేసీఆర్‌పై దుష్ప్రచారం చేస్తున్న పలు మీడియా ఛానళ్లపై బీఆర్ఎస్ పార్టీ ఫిర్యాదు చేసింది. బంజారాహిల్స్‌లోని పోలీస్ స్టేషన్‌లో పార్టీ తరఫున బాల్క సుమన్ ఫిర్యాదు చేశారు. లిక్కర్ స్కాం కేసులో కేసీఆర్ ఇమేజ్ దెబ్బతీసేలా ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో పాటు పలు మీడియా ఛానళ్లు అసత్య ప్రచారం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బాల్క సమన్ మీడియాతో మాట్లాడారు. కేసీఆర్‌పై దుష్ప్రచారం చేస్తున్న మీడియా ఛానళ్లపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బాల్క సుమన్ కోరారు. లిక్కర్ స్కాం కేసులో కేసీఆర్ పేరును ఈడీ ప్రస్తావించినట్లు నిరాధార ఆరోపణలను కొన్ని ఛానళ్లు ప్రసారం చేశాయని తెలిపారు. ఈ విషయంలో 16 న్యూస్ ఛానళ్లపై పోలీసులకు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. నిర్ధారణ చేసుకున్న తర్వాతే వార్తలు ప్రసారం చేయాలని సూచించారు. ప్రసార మాధ్యమాలు ప్రజాగొంతుకగా ఉండాలని హితవు పలికారు.

## ఇకపై వారికి నేరుగా శ్రీవారి దర్శనం..

# శుభవార్త చెప్పిన టీటీడీ..!



తిరుమల తిరుపతిలో శ్రీవారి దర్శనం కోసం నిత్యం వేలాదిమంది భక్తులు తరలి వస్తుంటారు. అయితే భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. ఈ నేపథ్యంలో వృద్ధులకు, దివ్యాంగులకు టీటీడీ శుభవార్త చెప్పింది. శ్రీనివాసుడి దర్శనం కోసం వచ్చే దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నేరుగా వేంకటేశ్వరస్వామి ఉచిత దర్శనం కల్పించేందుకు చర్యలు చేపట్టింది. వృద్ధులు, దివ్యాంగుల కోసం రోజులో ఒకసారి ప్రత్యేక స్లాట్‌ను ఏర్పాటు చేస్తూ టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి స్వామి వారిని దర్శించుకునేందుకు అనుమతి ఇవ్వనుంది. ఆలయం బయట గేట్ దగ్గరి పార్కింగ్ ప్రాంతం నుంచి కౌంటర్ వరకు ప్రత్యేక ఎలక్ట్రిక్ కారు అందుబాటులో ఉంటుందని టీటీడీ తెలిపింది. వృద్ధులు, దివ్యాంగుల స్లాట్ సమయంలో ఇతర క్యూలు నిలిపివేస్తారని, ఎలాంటి ఇబ్బంది లేకుండా కేవలం 30 నిమిషాల్లోనే స్వామి వారిని దర్శించుకుని బయటకు రావచ్చని తెలిపారు. అలాగే స్వామివారిని దర్శనం చేసుకునే వృద్ధులు, దివ్యాంగులు రూ.20 చెల్లించి రెండు లడ్డూలను తీసుకోవచ్చని టీటీడీ పేర్కొంది. వృద్ధులకు వయసు 65 సంవత్సరాలు పూర్తై ఉండాలని తెలిపింది. దివ్యాంగులు, ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకున్న వాళ్లు, కిడ్నీ ఫెయిల్యూర్ అయినవాళ్ల, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు, పక్షవాతం, ఆస్తమా లక్షణాలున్న వ్యక్తులు తిరుమల శ్రీవారిని ఉచితంగా దర్శించుకోవచ్చని పేర్కొన్నారు. ఒకవేళ వృద్ధులు వాళ్లకై వాళ్లే నిలువలేకపోతే ఒక వ్యక్తికి అనుమతి ఉంటుందని అన్నారు. ఐడీ ప్రూఫ్‌గా ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. దివ్యాంగులు తప్పనిసరిగా వారి ఐడీ కార్డుతోపాటు ఫిజికల్ ఛాలెంజ్డ్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు తీసుకురావాలని అన్నారు. వృద్ధులు, దివ్యాంగులు కాకుండా పైన తెలిపిన ఆరోగ్య సమస్యలు ఉన్నవారు సంబంధిత సర్జన్ /స్పెషలిస్ట్ జారీచేసిన మెడికల్ సర్టిఫికెట్, ఆధార్ కార్డుతో రావాలని చెప్పారు. వయోవృద్ధులు, దివ్యాంగులు దర్శనం స్లాట్ కోసం టికెట్‌ను ఆన్‌లైన్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం వెబ్‌సైట్ ద్వారా బుక్‌చేసుకోవాలని సూచించారు. అందుకోసం ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని అన్నారు.

# అగ్నిగోళంగా మారిన ఉత్తరాది..

## నాగ్‌పూర్‌లో 56 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



న్యూఢిల్లీ: ఉత్తరాది రాష్ట్రాలు అగ్నిగోళంలా మండిపోతున్నాయి. ఈ సమ్మర్‌లో అక్కడ రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలతో సూర్యుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. పలు రాష్ట్రాల్లో ఇప్పటికే ఉష్ణోగ్రతలు 50 డిగ్రీలు దాటేశాయి. రెండు రోజుల క్రితం దేశ రాజధాని ఢిల్లీని ముంగేష్‌పూర్‌లో 52.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. దీనికే ప్రజలు అమ్మో అనుకుంటుండగా.. ఇవాళ మహారాష్ట్రలో ఆ రికార్డును దాటేస్తూ గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నాగ్‌పూర్‌లో అత్యధికంగా 56 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కాగా, రికార్డు స్థాయి ఎండల కారణంగా మనుషులు పిట్టల్లా రాలిపోతున్నారు. గడిచిన 24 గంటల్లో వడ దెబ్బ కారణంగా పలు రాష్ట్రాల్లో 54 మంది ప్రాణాలు కోల్పోయారు. బిహార్‌లో అత్యధికంగా 32 మంది మరణించగా.. ఒడిశాలో 10, జార?ండ్‌లో 5, రాజస్థాన్‌లో 5, ఉత్తర్‌ప్రదేశ్‌లో ఒకరు, ఢిల్లీలో ఒకరు మరణించారు. కాగా, రానున్న రెండు రోజుల్లో యూపీ, ఢిల్లీ, చండీగఢ్, హర్యానాలోని పలు ప్రాంతాల్లో దుమ్ము తుఫాన్లు వచ్చే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అంచనావేస్తోంది.

## మెడిటేషన్ కోసం కాదు ప్రచారం కోసమే..

# మోదీ మౌన ముద్రపై శత్రుఘ్న సిన్హా




న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ కన్యాకుమారిలోని వివేకానంద రాక్ మెమోరియల్ వద్ద ధ్యానం చేస్తుండటంపై సీనియర్ నటుడు, అసన్‌సోల్ టీఎంసీ అభ్యర్థి శత్రుఘ్న సిన్హా స్పందించారు. తాను ప్రధాని నరేంద్ర మోదీని ఓ స్నేహితుడిగా చూస్తానని చెబుతూ ఆయన మెడిటేషన్ కోసం వెళ్లలేదని మీడియా దృష్టిని ఆకర్షించేందుకు వెళ్లారని చెప్పారు. గతంలో 2019 లోక్‌సభ ఎన్నికల సందర్భంలోనూ మోదీ కేదార్‌నాథ్ వెళ్లారని గుర్తుచేశారు. టెలిఫోన్స్, కమ్యూనికేషన్స్, మీడియా ప్రతినిధులతో అన్ని ఏర్పాట్లతో మోదీ ధ్యాన కేంద్రానికి చేరుకున్నారని అన్నారు. ఇది నూతన ప్రచార పోకడ అని కానీ ఇది చాలా ఆలస్యమైందని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు కోసం మోదీ ఎన్నో ప్రయత్నాలు చేశారని చివరి అస్త్రంగా ధ్యానం పేరుతో మౌన ముద్రను తెరపైకి తీసుకొచ్చారని శత్రుఘ్న సిన్హా అన్నారు.


## వడదెబ్బ తగిలి ఎన్నికల విధుల్లో ఉన్న ఆరుగురు జవాన్‌లు మృతి..




**మిర్జాపూర్:** దేశంలో ఎండలు మండిపోతున్నాయి. దాదాపు అన్ని రాష్ట్రాల్లో 45 నుంచి 50 డిగ్రీల మధ్య గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దాంతో ప్రజలు వేసవితాపాన్ని తాళలేక అల్లాడుతున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని మిర్జాపూర్‌లో వడదెబ్బ తగిలి ఎన్నికల విధుల్లో ఉన్న ఆరుగురు జవాన్‌లు మరణించారు. ఇవాళ 23 మంది జవాన్‌లు వడదెబ్బతో మా ఆస్పత్రిలో చేరారని, వారిలో ఆరుగురు చికిత్స పొందుతూ మరణించారని, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని మిర్జాపూర్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ ఆర్బీ లాల్ చెప్పారు. మరణించిన జవాన్‌లలో తీవ్ర జ్వరం, హై బీపీ లెవల్స్, హై షుగర్ లెవల్స్ ఉన్నాయని, అదే మరణానికి కారణమైందని అన్నారు. బీపీ, షుగర్ లెవల్స్ అధికంగా ఉంటే బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే అవకాశం ఉందని ఆర్బీ లాల్ చెప్పారు. వడదెబ్బ తగిలిన జవాన్‌లు అందరూ ఇక్కడ ఎన్నికల్లో ఉన్నట్లు చెప్పారని, తమ దగ్గరికి రావడానికి ముందు వాళ్లు సొమ్మసిల్లి పడిపోయినట్లు తెలిపారని అన్నారు.

## రహస్య భాగాల్లో దాచి బంగారం స్మగ్లింగ్..

# ఎయిర్‌హోస్టెస్ అరెస్ట్



బంగారం స్మగ్లింగ్ చేస్తూ ఓ ఎయిర్‌హోస్టెస్ అధికారుల ముందు అడ్డంగా దొరికిపోయింది. సుమారు కేజీ బంగారాన్ని రహస్య భాగాల్లో దాచుకుని తరలిస్తుండగా డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు గుర్తించి అరెస్ట్ చేశారు. డీఆర్ఐ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. నిందితురాలు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌కు చెందని ఎయిర్‌హోస్టెస్ సురభి ఖాతున్ గా గుర్తించారు. ఈ నెల 28న మస్కట్ నుంచి కేరళ కన్నూర్‌కు వచ్చిన విమానంలో ఆమె క్రూ సిబ్బందిగా ఉన్నారు. విమానం కన్నూర్ చేరుకోగానే.. అధికారుల తనిఖీల్లో ఎయిర్‌హోస్టెస్ బండారం బయటపడింది. ఆమె పురీషనాళంలో సుమారు 960 గ్రాముల బంగారాన్ని దాచిపెట్టి అక్రమంగా తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు ఆ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు డీఆర్ఐ అధికారులు తెలిపారు. అనంతరం సురభి ఖతున్‌ను మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా.. 14 రోజుల రిమాండ్ విధించినట్లు వెల్లడించారు. కాగా, సురభి ఖాతున్ బంగారాన్ని ఇలా అక్రమంగా తరలించడం ఇదేమీ తొలిసారి కాదు. గతంలోనూ చాలాసార్లు బంగారాన్ని స్మగ్లింగ్ చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

## రాష్ట్ర చిహ్నం జోలికి పోకుండా.. అభివృద్ధిపై దృష్టి పెట్టాలి..

## రేవంత్‌రెడ్డికి సీపీఐ నారాయణ సూచన



హైదరాబాద్: జయ జయహే తెలంగాణను రాష్ట్ర గీతంగా రూపొందించడం అభినందనీయమని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. అయితే రాష్ట్ర చిహ్నం మార్చకపోవడమే మంచిదని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్ర చిహ్నం జోలికి వెళ్లకుండా.. రాష్ట్ర అభివృద్ధిపై దృష్టిపెట్టాలని సూచించారు. హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో సీపీఐ నారాయణ మాట్లాడుతూ.. రాష్ట్ర గీతం కంపోజ్ చేయానికి కీరవాణిని మ్యూజిక్ డైరెక్టర్‌గా పెడితే తప్పేంటని ప్రశ్నించారు. కళలకు ప్రాంతీయ భేదాలు ఉండవని.. హద్దులు గీయడం సరికాదని అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీ ధ్యానం చేయడమంటే కన్యాకుమారిని కలుషితం చేయడమే అని విమర్శించారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ముగ్గురు ఇంజినీర్లు, సర్వేయర్

హైదరాబాద్ : భవన నిర్మాణానికి లంచం డిమాండ్ చేస్తూ పట్టుబడిన నీటిపారుదల శాఖకు చెందిన ముగ్గురు ఇంజినీర్లు, సర్వేయర్‌ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. రంగారెడ్డి జిల్లా నెక్నాంపూర్‌లో భవన నిర్మాణానికి ఎల్‌వోసీ కోసం ఓ వ్యక్తి నుంచి లచం డిమాండ్ చేశారు. సదరు వ్యక్తి నుంచి రూ. 2.50 లక్షలకు అధికారులు ఒప్పందం చేసుకున్నారు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచనల మేరకు ముందుగా ఒప్పందం మేరకు 1.50 లక్షలు నగదు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com